Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 228 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 19 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# మహిళా సాధికారతలో ఏపీ ముందుంది

**- మహిళల్ని మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటు - మహిళల ఓట్లు అడిగే పార్టీలు రిజర్వేషన్ బిల్లు అడ్డుకోవడమేంటి? - 33% రిజర్వేషన్లు అమలయ్యే దాకా పోరాడతాం - రాష్ట్రంలో గొడ్డలి పార్టీకి తెలిసింది కూల్చడం, నరకడమే - ఇక్కడ ఉన్నది 1995 సీఎం... గొడ్డలి పార్టీ ఆగడాలు సాగనివ్వను - జూన్ నాటికి పట్టణాల్లో 100% చెత్త క్లియర్ - స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు - నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి నివేదికను ప్రజల ముందుంచిన సీఎం**





**నిడదవోలు, (రాజధాని వార్తలు):** కాంగ్రెస్ నేతృత్వంలోని మిత్ర పక్షాలు సహకరిస్తే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేదని, కానీ ప్రతిసారీ మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకు అలవాటుగా మారిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మహిళలకు వ్యతిరేకంగా పనిచేసే పార్టీలు ఎన్నటికీ మనుగడ సాగించలేవని, మహిళలకు 33% రిజర్వేషన్లు అమలయ్యే వరకూ పోరాడతామని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఆడబిడ్డలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రం బిల్లు పెడితే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు అడ్డుకున్నాయి. రిజర్వేషన్లు సాధించే వరకూ ఆడబిడ్డలకు అండగా ఉంటాం. కాంగ్రెస్ సహా దాని మిత్రపక్షాలు మహిళ బిల్లును ఎందుకు అడ్డుకున్నారో సమాధానం చెప్పాలి. 1996లో దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు... నేను యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్నాను. ఆనాడు బిల్లు పెట్టేందుకు కాంగ్రెస్ సపోర్టు చేసేందుకు ఒప్పుకోకపోవడంతో విత్ డ్రా చేసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రధానిగా వాజ్ పేయి హయాంలో నాలుగు సార్లు బిల్లు తెచ్చారు. ప్రతిసారీ బిల్లు పాస్ కాకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. 2010లో యూపీఏ అధికారంలో ఉండగా మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదించారు. దాన్ని బీజేపీ కూడా సమర్థించింది. కానీ లోక్ సభకు బిల్లు తీసుకురాకుండా మహిళలకు కాంగ్రెస్ ద్రోహం చేసింది. ప్రధాని మోదీ 2023లో మహిళ రిజర్వేషన్ బిల్లును తీసుకొస్తే అందరూ సహకరించారు. దేశంలోని మహిళలకు సముచిత గౌరవం ఇవ్వాలని ప్రధాని మోదీ పట్టుదలతో బిల్లు తీసుకొస్తే మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడం ఎంతవరకూ సమంజసం? చిన్న రాష్ట్రాలు, దక్షణాది రాష్ట్రాలకు డీ లిమిటేషన్ వల్ల అన్యాయం జరుగుతుందంటున్నారు. ఆ లాజిక్ ఏంటో నాకు అర్థం కావడం లేదు. ప్రస్తుతం ఉన్న సీట్ల కంటే 50 శాతం పెరుగుతాయని పార్లమెంటు సాక్షిగా హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. వాజ్ పేయి హయాంలో 1971 లెక్కల ప్రకారం ముందుకెళ్లారు. మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ కు అలవాటుగా మారింది. 1996 నుంచి 2026 వరకూ 30 ఏళ్లుగా మోసం చేస్తూనే ఉన్నారు. మహిళా బిల్లు ఎప్పుడు పాస్ అవుతుందో ఆ దేవునికే తెలియాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా మేము 2017లోనే అసెంబ్లీలో తీర్మానం చేశాం. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మహిళలకు చేసిన మోసంపై ప్రజా చైతన్యం తీసుకొస్తాం.. మహిళలను చట్టసభల్లో చూడాలన్నది నా ఆకాంక్ష. కాంగ్రెస్ నుంచి వచ్చిన తోక పార్టీ రాష్ట్రంలో ఉంది. వారికి మహిళల సమస్యలు పట్టవు. మహిళలను గౌరవించినప్పుడే సమాజం ముందుకు వెళుతుంది."అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**మహిళల సామర్థ్యాన్ని గుర్తించి గౌరవించాం**

"మహిళలు ఎందులోనూ తక్కువ కాదు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఇంటిని సమర్థవంతగా నిర్వహించడంలో మహిళలు ముందున్నారు. దేశంలోనే మొదటిసారిగా మహిళలకు ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. ఆస్తిలో సమానహక్కు ఇచ్చారు. మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నేను మహిళల ఆర్థిక ప్రగతి కోసం డ్వాక్రా సంఘాలు స్థాపించాను. నేడు డ్వాక్రా మహిళలు రూ. 50 వేల కోట్ల రుణాలు తీసుకుంటున్నారు. రూ. 25 వేల కోట్ల కార్పస్ ఫండ్ పొదుపు సంఘాల దగ్గరుంది. మహిళలకు ఉద్యోగాల్లో, కాలేజీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశాను. దీంతో వరకట్న సమస్యను పూర్తిగా రూపుమాపాం. ఐటీలో భర్త కంటే భార్యనే ఎక్కువగా సంపాదిస్తోంది. ఎన్డీఏ ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ప్రతి నెలా ఒకటో తేదీన 63 లక్షలమందికి పింఛన్లు ఇస్తున్నాం. ఇందుకోసం రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఆర్థిక సాయం అందిస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఉద్యోగస్తులు కూడా బస్సులో ఉచిత ప్రయాణం చేస్తూ ఎక్కడికైనా వెళుతున్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**గొడ్డలి పార్టీతో ప్రజలకు ప్రయోజనం శూన్యం**

"సుపరిపాలనే కూటమి లక్ష్యం. రాష్ట్రానికి రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. దీంతో 23 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గత ప్రభుత్వం పోలవరం డయాఫ్రంవాల్ ను గోదావరిలో కలిపేసింది. కేంద్ర సహకారంతో గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించింది. గతంలో రాజధానికి రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. తాజాగా 10 గ్రామాల రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. మన రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ఒకటుంది. పేదలకు కడుపునిండా తిండి పెట్టడానికి వారికి మనసు రాదు. పేదలకు పట్టెడన్నం పెట్టాలనే లక్ష్యంతో మనం తెచ్చిన అన్న క్యాంటీన్లను కక్షతో మూసేశారు. ప్రజా ప్రభుత్వంలో 269 అన్న క్యాంటీన్లు పని చేస్తున్నాయి. పేదలకు కడుపు నిండా తిండి పెట్టలేని ప్రభుత్వాలు ఉన్నా ఒకటే...లేకపోయినా ఒకటే. గొడ్డలి పార్టీ వల్ల ప్రజలకు ఉపయోగం లేదు. గొడ్డలిపార్టీకి తెలిసిందల్లా విధ్వంసం, కూల్చడం, నరకడమే. రాష్ట్రంలో సీబీఎన్, పవన్ కల్యాణ్...కేంద్రంలో నరేంద్ర మోదీ ఉన్నారని వారు గుర్తుంచుకోవాలి. ఎవర్నీ వదిలి పెట్టం."అవి ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

**జూన్ నాటికి పట్టణాల్లో 100 శాతం చెత్త క్లియర్**

"రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ముందుకెళ్తోంది. నేను 4వ సారి ముఖ్యమంత్రిగా పని చేస్తున్నాను. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని 15 నెలలుగా నిర్వహిస్తున్నాం. ప్రతి నెలా 3వ శనివారం ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతున్నాను. ఈసారి జలధార–జలహారతి థీమ్‌తో ముందుకొచ్చాం. గత పాలకులు రాష్ట్రాన్ని చెత్తకుప్పగా మార్చేశారు. భూమి పైనే కాదు భూమి లోపల కూడా చెత్త వేశారు. ఎక్కడ చూసిన చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. ఒక పద్ధతి ప్రకారం పని చేస్తున్నాం. ప్రజల్లోనూ చైతన్యం రావాలి. మన ఇల్లు, మన వీధి, మన ఊరు, మన ఆఫీసు, మన స్కూళ్లు, కాలేజీలు, పబ్లిక్ ప్లేస్‌లు, బీచ్‌లు, ఆలయాలు, పార్కులు పరిశుభ్రంగా ఉండాలి. జపాన్‌లో రోడ్లపై ఒక్క చిన్న పేపర్ ముక్క కూడా కనిపించదు. ఆ స్ఫూర్తి మనలోనూ రావాలి. ప్రతీ రోజూ పట్టణాల్లో 7,527 టన్నులు, గ్రామీణ ప్రాంతాల్లో 1,430 టన్నులు... మొత్తంగా 8,957 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణాల్లో 153 లక్షల టన్నుల చెత్తకు గాను, 114 లక్షల టన్నుల చెత్త తొలగించాం. ఈ జూన్ నాటికి 100 శాతం క్లియర్ చేస్తాం. ప్రభుత్వ చర్యలతో పట్టణాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ 86 శాతం నుంచి 97 శాతానికి పెరిగింది. త్వరలోనే 100 శాతం సాధించేలా ఎలక్ట్రిక్ వాహనాలు తెస్తున్నాం. రాష్ట్రంలో చెత్త ప్రాసెసింగ్ 57 శాతం నుంచి 100 శాతానికి పెంచుతాం. రూ.603 కోట్లతో 107 ఆధునిక ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. అక్టోబర్ నాటికి ఇవన్నీ పని చేస్తాయి. స్వచ్ఛ రథాలు, గ్రీన్ షాప్స్ ద్వారా చెత్తను ఆదాయంగా మారుస్తున్నాం. రాష్ట్రంలోని 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు 12,371 గ్రామాలు ODF+ కి చేరుకోగా, సెప్టెంబర్‌కి అన్ని గ్రామాలను ODF+ గా చేస్తాం. ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఉండాలి. ప్రతి ఒక్కరూ వంటింటి వ్యర్థ్యాలను కిచెన్ గార్డెన్‌కు ఉపయోగించుకోవాలి. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి... 7.14 లక్షల కిచెన్ గార్డెన్స్, 1 లక్ష సోక్ పిట్స్, 8,000 కమ్యూనిటీ సోక్ పిట్స్, 100 కి.మీ. మ్యాజిక్ డ్రైన్స్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నాం. 13 నగరాలకు 71 స్వీపింగ్ యంత్రాలు సమకూర్చాం. మరో 14 యంత్రాలకు టెండర్లు పిలిచాం. 2028 నాటికి 6 Waste to Energy ప్రాజెక్టులు వస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతంగా ఉన్న గ్రీన్ కవర్‌ను... 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. సర్క్యులర్ ఎకానమీలో ఇండస్ట్రియల్ పార్కులు తీసుకొస్తున్నాం"అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.


**నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి హామీలు**

నియోజకవర్గ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల పనితీరుకు సంబంధించిన నివేదికలను వివరించారు. పనితీరు సరిగా లేని అధికారులను వివరణ అడిగారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. అధికారులకు సహకరిస్తామని, వారంతా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పరిశ్రమలు తక్కువగా వస్తున్నాయని, ఇక్కడ వ్యవసాయంపైన ఆధారపడే వారు ఎక్కువగా ఉండటమే అందుకు కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ ప్రాంతంలో ఆక్వా కల్చర్ వల్ల రైతులకు కొంత వెసులుబాటు వచ్చింది. ఆక్వా వల్ల పొల్యూషన్ లేకుండా చర్యలు తీసుకుంటాం. కుళాయి ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందిస్తాం. నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యత. స్థానికంగా చిన్న కాశిరేవు వంతెన పునర్నిర్మాణం చేపడతాం. ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తాం. ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తాం. ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి చేస్తాం. కంసాలిపాలెం నుంచి మాధవ వరం వరకు వంతెన నిర్మాణం, ఎర్ర కాలువ గండ్లు పూడ్చివేతతో పాటు రహదారుల నిర్మాణం, టిడ్కో ఇళ్లు పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రామానాయుడు, కందుల దుర్గేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి సహా పలువురు ఉన్నతాధికారులు, నేతలు పాల్గొన్నారు.

# పునర్విక‌కు పునర్జన్మ

**- చిట్టి చెల్లెలు చిరునవ్వుల కోసం అన్నగా మంత్రి నారా లోకేష్ అలుపెరుగని కృషి - రూ.16 కోట్ల ఖరీదైన జోల్ జెన్ స్మా ఇంజెక్షన్ విదేశాల నుంచి తెప్పించేందుకు లోకేష్ సాయం - మంత్రి నారా లోకేష్ సమక్షంలో హైదరాబాద్ రెయిన్ బో ఆసుపత్రిలో ఇంజెక్షన్ ఇచ్చిన వైద్యులు - నెటిజన్లు, ప్రజల ప్రార్థనలు - సహాయం ఫలించేందుకు అన్నగా అండగా నిలిచిన లోకేష్ - పునర్విక ప్రాణాలు కాపాడిన మంత్రి లోకేష్, వైద్యులు, ప్రజలకు కుటుంబసభ్యుల కృతజ్ఞతలు**

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** కొన్ని నెలల క్రితం మీడియా–సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా.. సేవ్ పునర్విక.. పునర్వికను కాపాడుకుందాం అంటూ లక్షల హృదయాలు స్పందించాయి. చేతనైన సాయం చేశాయి. చేయలేని వారు ప్రార్థించారు. ఇంజెక్షన్ కోసం వెల్లువలా విరాళాలు వచ్చాయి. ఇంకా చిన్నారి చిరునవ్వులు వెలగాలంటే 6 కోట్లు కావాలి..అప్పుడే అందింది మంత్రి నారా లోకేష్ రూపంలో ఆపన్నహస్తం. ఇంకా ఎంత అవసరమైతే అంతా తానే సమీకరిస్తానని, అన్ని విధాలా అండగా ఉంటానని పునర్విక తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి చిట్టి చెల్లెలు చిరునవ్వుల కోసం అన్నగా అన్నీ తానై వ్యవహరించిన నారా లోకేష్. పునర్వికకు పునర్జన్మను ప్రసాదించే చికిత్సకు సాయం అందించారు. విదేశాల నుంచి రూ.16 కోట్ల ఇంజెక్షన్ తెప్పించేందుకు సహకరించారు. ఇంజెక్షన్ వేసేటప్పుడు చిన్నారి పునర్విక చెంతనే ఉన్నారు. సాయం అందించిన లక్షలాది మంది ప్రార్థనలు ఫలించాయి. పునర్జన్మ పొందిన పునర్విక అన్నయ్య లోకేష్ చేతుల్లోంచి బోసినవ్వులు చిందిస్తోంది. అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ(SMA TYPE–1) వ్యాధితో బాధ పడుతున్న పునర్వికకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అండతో పునర్జన్మ లభించింది. ఇంజెక్షన్ ను అమెరికా నుంచి హైదరాబాద్ రప్పించేందుకు మంత్రి నారా లోకేష్ చేసిన సాయంతో పునర్విక

ప్రాణాలు నిలిచాయి. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రెయిన్ బో పిల్లల ఆసుపత్రిలో ఈ ఉదయం మంత్రి నారా లోకేష్ సమక్షంలో వైద్యులు అమెరికా నుంచి తీసుకువచ్చిన జోల్ జెన్ స్మా అనే జీన్ థెరపీ ఇంజెక్షన్‌ను చిన్నారికి ఇచ్చారు. అనంతరం మంత్రి లోకేష్.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారి ఏడుస్తుండటంతో కొద్దిసేపు ఎత్తుకుని లాలించారు. చిన్నారిని కాపాడటం తన బాధ్యత అని, అన్ని విధాలా అండగా ఉంటానని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. లక్షలాది మంది ఆశీస్సులతో పునర్విక ప్రాణాలు కాపాడుకోగలిగామని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

**రూ.16 కోట్ల ఇంజెక్షన్ ఒక్కటే మార్గం**

కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన ఏడాది వయసున్న పునర్విక ప్రాణాంతకమైన వెన్నెముక కండరాల క్షీణత అనే వ్యాధితో బాధ పడుతోంది. చిన్నారి తండ్రి జంపాల మంగళ సురేష్ కుమార్ క్షవర వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పునర్విక జన్మించి ఆరు నెలలలైనా శరీరం కదిలించకపోవడంతో కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కర్నూలు వైద్యుల సలహా మేరకు చిన్నారిని హైదరాబాద్ లోని రెయిన్ బో చిన్నపిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లారు. పునర్వికకు అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ సోకిందని, చిన్నారిని రక్షించుకునేందుకు ఉన్న ఏకైక మార్గం రూ.16 కోట్ల ఖరీదైన జోల్ జెన్ స్మా అనే ఒకసారి మాత్రమే ఇచ్చే జీన్ థెరపీ ఇంజెక్షన్ అని వైద్యులు తెలిపారు.

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేష్**

ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో చిన్నారి తల్లిదండ్రులు సురేష్ కుమార్, పుష్పావతి ఈ ఏడాది జనవరి నుంచి దాతల సాయం కోరారు. పునర్వికను కాపాడాలంటూ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రతిఒక్కరూ స్పందించి మానవత్వం చాటుకున్నారు. ఫిబ్రవరి నాటికి విరాళాల ద్వారా రూ.10 కోట్ల వరకు సమకూరాయి. సాయం కోసం ఎక్స్ ద్వారా చిన్నారి తల్లిదండ్రులు మంత్రి లోకేష్‌ను విజ్ఞప్తి చేశారు. ఆపదలో అండగా నిలిచే మంత్రి నారా లోకేష్.. పునర్విక ఆరోగ్య పరిస్థితిపై తక్షణమే స్పందించారు. పునర్విక బాధ్యత తీసుకుంటానని, చిన్నారిని కాపాడతామని హామీ ఇచ్చారు. దీంతో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

**ఇంజెక్షన్ కోసం మంత్రి లోకేష్ నిరంతర పర్యవేక్షణ**

అమెరికా నుంచి ఖరీదైన ఇంజెక్షన్‌ను త్వరితగతిన హైదరాబాద్‌కు రప్పించే పనిని తన సిబ్బంది ద్వారా నిరంతరం లోకేష్ పర్యవేక్షించారు. ప్రముఖ ఔషధ కంపెనీ నోవార్టీస్, రెయిన్ బో ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులను సమన్వయ పరిచారు. వైద్య పత్రాలు, ఒప్పందాలు పూర్తిచేయడం, ప్రభుత్వ ధృవపత్రాలు, వినతులు తయారీ, చెల్లింపులు, రవాణా అంశాల్లో సహాయ సహకారాలు అందించారు. పునర్విక చికిత్సలో ఎలాంటి ఆలస్యం జరగకుండా మంత్రి లోకేష్ చేసిన కృషితో నిండు ప్రాణాలు నిలిచాయి.

**ఇది పునర్జన్మే..**

తాము పునర్వికకు జన్మనిస్తే.. మంత్రి నారా లోకేష్, మానవతా హృదయాల స్పందనతో పునర్జన్మ లభించిందని తల్లిదండ్రులు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లోకేష్ చేసిన సాయాన్ని జీవింతాంతం గుర్తు పెట్టుకుంటామని భావోద్వేగంతో చెప్పారు. తమ చిన్నారి పునర్విక ప్రాణాలు కాపాడేందుకు సహాయం అందించడమే కాకుండా, భవిష్యత్తులోనూ అన్ని విధాలా అండగా ఉంటానని లోకేష్ భరోసా ఇచ్చారని తెలిపారు. వైద్యం అందించిన డాక్టర్లు, స్పందించిన ప్రతి హృదయానికి, ప్రార్థించిన ప్రతీ ఒక్కరికీ, సాయం అందించిన ప్రతీ ఒక్కరికీ నమస్కారాలు తెలియజేశారు పునర్విక తల్లిదండ్రులు.

# జలధార కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలి

## - జలధార - నీటి భద్రత ద్వారా భూగర్భ జల మట్టాలను పెంచాలి - జలధార నిధులను సమర్థవంతంగా వినియోగించాలి - జలధార నీటి భద్రతపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో జలధార - నీటి భద్రత కింద చేపడుతున్న పనుల వలన భూగర్భ నీటి మట్టాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. అంతేకాకుండా నీటి వనరుల నిల్వలు పెంచడానికి, నీటిని సంరక్షించడానికి, సాగు నీటి వ్యవస్థ బలోపేతం అవడానికి ప్రణాళికలు తోడ్పడాలన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మంది రంలో ఎంపీడీవోలు, ఇరిగేషన్ సంబంధిత అధికారులతో జల ధార - నీటి భద్రత పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ జలధార కింద గ్రామాల్లో ప్రాధాన్యత గుర్తించిన చెరువుల పనులకు డీటెయిల్డ్ ఎస్టిమేట్లను తయారు చేసి పంపాలని ఆదేశించారు. ఈ గ్రామాల్లో పనులతో భూగర్భ జల మట్టాలు పెరిగేలా ప్రతిపాదనలు ఉండాలన్నారు. జిల్లాలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరులు సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించాలన్నారు. అందులో భాగంగా నీటి వనరు లను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు, వాగులు, చెరువుల అనుసంధానం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు.

సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం, కాలువల పూడికతీత, లాక్స్ మరమ్మతులు వంటి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో చెక్ డ్యాములు ఉంటే గుర్తించి క్లియర్ చేసేందుకు ఎన్ఆర్ఈజిఎన్ ద్వారా పనులను ప్రతిపాదించాలన్నారు. గ్రామ పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంట లు, కాలువల అనుసంధానం, కాస్కెట్ ట్యాంక్‌లు, అలాగే జిల్లాలో నున్న చెరువులకు పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ పనులన్నీ ఉపాధి హామీ పథకం కింద రిజిస్టర్ కావాలన్నారు. ఉపాధి హామీ నిధులు సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు ఉండాలన్నారు. జిల్లా ప్రణాళికలు, రైతులకు ఉపకరించేలా రూపొందించాలన్నారు. ఎంపీడీవోలు, ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యు.ఎం.ఏ పిడి, ఇరిగేషన్ అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు రంగస్థల దినోత్సవం









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కందుకూరి సాహిత్యంలో కొత్త వెలుగులు నింపి పునరుజ్జీవం తెచ్చారని మేరా యువ భారత్ జిల్లా అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి పేర్కొన్నారు. అక్షయ్ సొసైటి ఫర్ హెల్త్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నెల్లూరు శ్రీ రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక భవనం (టౌను హాలు)నందు కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకొని తెలుగు రంగస్థల దినోత్సవం సందర్భంగా కళాకారులకు కందుకూరి విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా కందుకూరి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కందుకూరి విశిష్ట సేవా పురస్కార గ్రహీతలు పి.శ్రీనివాసులు రెడ్డి, లోకా అపరాజిత, సింధూరి పవన్ కుమార్, పెనుబడి రఘు రాములను శాలువా, మాల, మొమెంటో, మెడల్, ప్రశంసాపత్రం, కిరీట దారణతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.రమేష్ బాబు, అందే శ్రీనివాసులు, యనమల నాగేశ్వరరావు, ఎ.జయప్రకాశ్, డాక్టర్ రాచపాలెం రఘు, డాక్టర్ చీదరాల చెన్నయ్య, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, జోష్న, శ్రీకర్ రెడ్డి, ఓంకారం వెంకటేశ్వర్లు, కేతా సుధాకర్ రెడ్డి, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ.3 - ఎన్.4 జంక్షన్ అభివృద్ధి పనులు తక్షణం పూర్తి చేయండి



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజధాని అమరావతికి ముఖ ద్వారమైన వెంకటపాలెం గ్రామం వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డు (ఈ-3) మీదుగా క్రాస్ అవుతున్న ఎన్ - 4 (నవులూరు నుంచి వెంకటపాలెం వచ్చు) రహదారి జంక్షన్ ప్రదేశాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి అభివృద్ధి చేయాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి వారు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రానున్న వారం రోజుల్లో ఈ జంక్షన్‌లో బీటీ పనులు చేపట్టి ముస్తాబు చేయాలని సూచించారు. శనివారం అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రాజధానికి ప్రజల రద్దీ పెరిగినందున ఈ ప్రదేశాన్ని తక్షణం అభివృద్ధి చేయాలన్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్‌ను దాటుతున్న కొండవీటివాగు, పాలవాగులను వెంకటపాలెం, యర్రబాలెం గ్రామాల వద్ద మట్టి పూడికతీత పనులను జాతీయ రహదారుల అధికార సంస్థ (ఎన్ హెచ్ఎఐ) అధికారులతో సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. ఎన్‌హెచ్-16 రహదారిపై డీజీపీ ఆఫీసు వద్ద ఈ-13 పొడిగింపు పనులను పరిశీలించారు. ఈ జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డును తవ్విన ప్రదేశంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చేసి బెర్మ్ వేసి వాహనాలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని ఏడీసీ ఛీఫ్ ఇంజినీరు బి.నరసింహమూర్తిని ఆదేశించారు. రాజధానిలోని హెచ్‌వోడీ టవర్స్ వద్ద జరుగుతున్న పాల వాగు, పేరమ్మ వాగు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇక్కడ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న దృష్ట్యా వాగులలో నీటిని ఈ-5 రోడ్డు వైపు మళ్లింపు పనులను ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో ఏడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.బసవేశ్వరరావు, వి.పద్మాకర ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా ఆవిర్భవించాలి



**గుంటూరు, (రాజధాని వార్తలు):** బాల్య వివాహాల రహిత జిల్లాగా గుంటూరు జిల్లా ఆవిర్భవించాలని రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు పి.పద్మలత పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు పి.పద్మలత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాల వివాహ ముక్త్ కార్యక్రమాన్ని అమలు చేస్తూ బాల్య వివాహాలు నివారణకు కృషి చేస్తుందన్నారు. మహిళ శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారులు స్పష్టమైన వివరాలు కలిగి ఉండాలని అన్నారు. ఏ సామాజిక వర్గంలో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయో గుర్తించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సామాజిక రుగ్మతగా ఉన్న బాల్య వివాహాలను నిర్మూలించాలని తెలిపారు. విద్యా సంస్థలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలను తెలియజేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఇతర సిబ్బంది దీనిపై పకడ్బందీగా పని చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. వివరాలు ఉంటే చైల్డ్ రైట్స్ కమిషన్‌కు తెలియజేయవచ్చని చెప్పారు. గ్రామ స్థాయిలో కమిటీలు మరింత జాగరూకతతో పనిచేయాలని సభ్యులు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, కమిటీ సభ్యులు దుర్గా భవాని, ప్రమీల, జిల్లా బాలల రక్షణ అధికారి సి.హెచ్ విజయ కుమార్, ఎస్.జి.ఎస్.డబ్ల్యా సమన్వయ అధికారి మోహన్ రెడ్డి, మెప్మా ప్రాజెక్టు అధికారి సింహాచలం, మహిళ శిశు సంక్షేమ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరిన జర్నలిస్టులు





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంటలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయాలని రేణి గుంట ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మణి, రేణిగుంట జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాగ్యరాజ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణిగుంట ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న కేంద్రంగా మారిందని, ముఖ్యంగా అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే జంక్షన్, పారిశ్రామిక ప్రాంతాలు ఉండటంతో ఇక్కడ వార్తా కార్యకలాపాలు రోజురోజుకు విస్తరిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాంతంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం తరపున గుర్తింపు, సౌకర్యాలు అత్యంత అవసరం అని వివరించారు. ప్రత్యేకంగా రేణి గుంట విమానాశ్రయంలో ప్రోటోకాల్ విధులు నిర్వహించే జర్నలిస్టులు ప్రతిరోజూ కీలక కార్యక్రమాలు, ప్రముఖుల రాకపోకలను కవర్ చేస్తూ తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారన్నారు. అయితే వారికి అక్రిడేషన్ లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అక్రిడేషన్ కార్డులు ఉంటే భద్రతా పరిమితుల్లో సులభంగా ప్రవేశం లభించడంతో పాటు అధికారిక కార్యక్రమాల కవరేజీ మరింత సులభతరం అవుతుందని, ఇది జర్నలిస్టుల పనితీరును మెరుగుపరచడమే కాకుండా ప్రజలకు సమయానికి ఖచ్చితమైన సమాచారం అందించేందుకు దోహదపడుతుందని వివరించారు. రేణిగుంటలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ జర్నలిస్టులు సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తు న్నారన్నారు. మీ సమస్యలను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట జర్నలిస్టులు రమేష్, సత్య, మధు, జలీల్, రాజా, కృష్ణ, మోహన్ నాయుడు, చందు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్ హిమాన్ష శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు కలెక్టర్ కార్యాలయములోని తిక్కన ప్రాంగణములో ఉద్యోగస్తుల గ్రీవేన్సును జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్లా అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ ఎస్టీఉద్యోగుల నుండి వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్లా, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవిన్యూ అధికారి విజయ కుమార్ లు అర్జీలను స్వీకరించారు. గత సంవత్సరం జూలై-25, 2025 సవత్సరము నుండి ప్రతి నెలా 3 వ శుక్రవారము ఉద్యోగస్తుల గ్రీవెన్స్‌ను నిర్వ హించడం జరుగుతుందన్నారు ఇప్పటి వరకు 4 శుక్రవారాలు ఉద్యోగస్తుల గ్రీవేన్సును నిర్వహించారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఉద్యోగస్తుల గ్రీవేన్సులో 235 పిర్యాదులు అందగా ఆందులో 172 పరిష్కారము కాగా మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. వచ్చిన పిర్యాదులను సంబంధిత అర్జీ దారునితో వివరంగా చర్చించి ఆయా శాఖల అధికారులకు అందించారు. త్వరితగతిన పిర్యాదులను పరిష్కరించి వివరాలు తెలియ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# విపిఆర్ టోర్నమెంట్‌కు విశేష స్పందన

## - క్రీడల్లో యువతకు ప్రోత్సాహం : టీడీపి ఇందుకూరు పేట అధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి




**బుచ్చి /కోవూరు, (రాజధాని వార్తలు):** వేమిరెడ్డి దంపతుల దాత్రుత్వంలో దామరమడుగులో జరుగుతున్న క్రీడల పట్ల విశేష స్పందన ఉందని విపిఆర్ సేవలు ఎనలేనిదని ఇందూకూరుపేట టీడీపి మండలం అధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి అన్నారు. మెగా క్రికెట్ టోర్నమెంట్‌తో క్రీడాలను ప్రోత్సాహం ఇచ్చే విధంగా ఉందని, అనంతరం క్రీడాకారులను అభినందించారు. ఇలాంటి క్రీడల ద్వారా యువతను ప్రోత్సహిస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్న విపిఆర్ దంపతుల సేవలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్ర మంలో టీడీపి నేతలు, సాయి రెడ్డి, తదితరులు ఉన్నారు.

# మూడవసారి రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నిక పట్ల అభినందనలు తెలిపిన బీద మస్తాన్ రావు




**న్యూఢిల్లీ, (రాజధాని వార్తలు):** రాజ్యసభ ఉపాధ్యక్షునిగా మూడోసారి ఎన్నికైన హరివంశ్ నారాయణ్ సింగ్, కు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ తరపున మరియు పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తరపున, అలాగే తెలుగు ప్రజల తరపున హరివంశ్ నారాయణ్ సింగ్‌కి శుభాకాంక్షలు బీదా తెలిపారు. ఆయన ఎన్నిక సభ మొత్తం కలిగిన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తన పదవీ కాలంలో పార్లమెంటరీ విధానాలపై లోతైన అవగాహనతో, సమతుల్య ధోరణితో, ప్రశాంతతతో మరియు నిష్పక్షపాతంగా సభను నడిపిన తీరు ప్రశంసనీయం అని అన్నారు. ప్రస్తుతం పార్లమెంటరీ వ్యవహారాలు మరింత చురుకుగా మారుతున్న నేపథ్యంలో, క్రమశిక్షణను కాపాడుతూ సార్థక చర్చలకు అవకాశమివ్వడం ఆయన ప్రత్యేకతగా నిలిచిందని తెలిపారు. ఆయన పునః ఎన్నిక ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయన అంకిత భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా సభ్యులందరి నుండి ఆయనకు లభించిన గౌరవం, విశ్వాసం ఆయన నిష్పక్షపాత వైఖరికి ప్రతిబింబమని అన్నారు. ఆయన నాయకత్వంలో సభ మరింత శ్రేయోభిలాషి విధంగా కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు పార్లమెంటరీ విధానాల్లో మార్గనిర్దేశం చేయడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. అంతేకాకుండా, చిన్న పార్టీలకు మరియు స్వతంత్ర సభ్యులకు కూడా తగిన అవకాశాలు, సమయం కేటాయించాలని వినమ్రంగా అభ్యర్థించారు. ఆయన పదవీ కాలం విజయవంతంగా కొనసాగాలని బీద మస్తాన్ రావు ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

# మాజీ ప్రధాన మంత్రి చంద్రశేఖర్ 100వ జయంతికి ఘన నివాళులు అర్పించిన బీద మస్తాన్ రావు యాదవ్



**న్యూఢిల్లీ :** మాజీ ప్రధాన మంత్రి చంద్రశేఖర్ 100వ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని రాజ్ ఘాట్ వద్ద ఘనంగా నివాళులను రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన గొప్ప సేవలను కొనియాడారు. ఆనాడు దేశ రాజకీయ చరిత్రలో చంద్రశేఖర్ సత్యనిష్ఠ, ధైర్యం మరియు ప్రజాసేవకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సామాన్య ప్రజల సమస్యలపై ఆయన చూపిన కట్టుబాటు, నిస్వార్థ సేవ రాజకీయ నాయకులందరికీ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన నేతలు ఉన్నారు. దేశ సమగ్ర అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ముఖ్యంగా యువతకు ఆయన జీవితం ఒక గొప్ప ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం దిశగా అడుగులు పడడం దేశ చరిత్రలో ఒక గొప్ప మైలురాయి

## - సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**సూళ్ళూరుపేట, (రాజధాని వార్తలు):** భారత దేశ చరిత్రలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం దిశగా అడుగులు పడటం ఒక గొప్ప మైలురాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆమె 2వ రోజు పార్లమెంట్ పరిణామాలపై స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ మహిళలు సమాజంలో 50 శాతం ఉన్నప్పటికీ, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం విచారకరం అన్నారు. ఈ అంతరాన్ని తొలగించి, మహిళా సాధికారతకు బాటలు వేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ చారిత్రక నిర్ణయానికి తాను పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుండి మహిళా పక్షపాతి అని గుర్తు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ బిల్లుకు అన్ని పార్టీల మద్దతు కూడగట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె కొనియాడారు. మహిళల అభ్యున్నతి కోసం ఇప్పటికే సీఎం అనేక లేఖలు రాశారని, వారి సాధికారతే నిజమైన సమాజ పురోగతికి మూలమని ఆమె స్పష్టం చేశారు. ఢిల్లీలో సాగుతున్న ఈ చర్చలు సఫలీకృతమై, బిల్లు త్వరలోనే చట్టంగా మారుతుందనే ధీమాను ఆమె వ్యక్తం చేశారు.

# గుమ్మలదిబ్బలో పోలీసుల కార్డన్ సెర్చ్

## - నేరాల నివారణే పోలీస్‌ల లక్ష్యం - భద్రతపై అవగాహన కల్పించిన పోలీస్ అధికారులు




**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు మండలంలోని గుమ్మలదిబ్బ గ్రామంలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ సెర్చ్ నిర్వహించి. భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పిం చారు. శుక్రవారం గ్రామంలోని ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేపట్టారు. గ్రామంలో అపరచితులు వచ్చిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా, అనుమానాస్పద కదలికలు ఉన్నాయా అనే అంశాలపై ఆరా తీశారు. జిల్లా ఎస్పి అజిత వేజండ్ల ఆదేశాలమేరకు రూరల్ డియస్పి గట్టమనేని శ్రీనివాసులు సూచనల మేరకు నేరాలను ముందస్తుగా నివారించడమే లక్ష్యంగా ఈ కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో రూరల్ సిబ్బంది, సీఐలు, ఎస్సైలు ముత్యాలరావు మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో పాత నేరస్తులు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి కూలంకషంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలు తమ ఇళ్లను వదిలి ఊర్లకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐదు రోజుల కంటే ఎక్కువ కాలం పాటు ఇళ్లు ఖాళీగా ఉంటే ముందస్తుగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాంటి సమాచారాన్ని ఎల్‌హెచ్‌ఎంఎస్ వ్యవస్థలో నమోదు చేసి, ఇళ్ల భద్రతను పోలీసులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ సేవలను ఉచితంగా అందిస్తున్నామని, ప్రజలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఇక ఇంటి భద్రతను మరింత బలోపేతం చేయడానికి అవసరమైతే సెన్సార్ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేసి, 24 గంటలు పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. దీంతో ప్రజలు ఎక్కడ ఉన్నా తమ ఇంట్లోని విలువైన వస్తువులు సురక్షితంగా ఉంటాయని భరోసా ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని సూచించిన పోలీసులు, పిల్లల భద్రతపై కూడా అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు సెల్‌ఫోన్లు ఇస్తే తప్పనిసరిగా చైల్డ్ మోడ్‌లో ఉంచాలని, లేనిపక్షంలో ఇంటర్నెట్‌లో ఉన్న మంచి–చెడు కంటెంట్ వారికి అందుబాటులోకి వచ్చి దుష్ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ వంటి వాటి పట్ల పిల్లలు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు సరైన అవగాహన కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్న పోలీసులు, సమాజంలో శాంతి భద్రతలు కాపాడటానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

గ్రామస్తులు అప్రమత్తంగా ఉండి అను మానాస్పద అంశాలపై వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనికీలలో సరి అయిన పత్రాలు లేకుండా ఉన్న 24 వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేయడం జరిగిందన్నారు. వాటిని పరిశీలించి తదుపరి చర్యలు ఉంటాయన్నారు. ఈ తనిఖీలలో యస్ ఐ ముత్యాలరావుతోపాటు వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి పలువురు యస్‌ఐలు సిబ్బంది ఉన్నారు.


# కుల గణన ప్రకారం బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయాలి

## - ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరావు




**న్యూఢిల్లీ :** ప్రభుత్వం చేపట్టే కులగననసర్వే తర్వాతనే డీలిమిటేషన్ చేపట్టాలి బీసీ కులగనణన పూర్తి చేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్ల పెంచాలని ఆంధ్రప్రదేశ్ ,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్ రావు అన్నారు. న్యూ ఢిల్లీలో ఆంధ్ర తెలంగాణ భవన్ వద్ద శుక్రవారం చేపట్టిన నిరసన ధర్నా కార్యక్రమంలో మాట్లాడారు. మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోట కల్పించాలి లేనిపక్షంలో పెంచిన అసెంబ్లీ పార్లమెంటు స్థానాలు మహిళల పేరుతో మళ్లీ అగ్రకులాలకు దక్కుతాయి ...అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం డీలిమిటేషన్ పత్రాలను చింపివేసి నిరసనలు, డీ లిమిటేషన్ వల్ల బీసీలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. దేశవ్యాప్తంగా బీసీ కులగనణన పూర్తి చేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్ల పెంచాలని డిమాండ్ చేసారు. దేశంలోని 40 కోట్ల మంది బీసీ మహిళల ఆక్రందనను కేంద్రం పట్టించుకోవడం లేదు స్థానిక సంస్థలలో లాగానే చట్టసభల్లో కూడా బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెం చకుండా డీలిమిటేషన్ చట్టం చేస్తే ఉపయోగం లేదని బీసీ నేతలు అన్నారు. జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో కుమ్మర క్రాంతి కుమార్ మహేష్ మేక వెంకటేశ్వర్లు తదితర నాయకులు ఏపీ బీసీ సంఘ నేతలు పాల్గొన్నారు.

# చెందోడులో డ్రైనేజీ కాలువ ఆక్రమించి అక్రమ కట్టడాలు

**కోట, (రాజధాని వార్తలు):** మండల కేంద్రంలోని విద్యానగర్ చెందోడు పంచాయతీ ఒడ్డుపాలెంలో చిన్న సన్న కారు రైతులు పండించుకునే మాగాణికి చెందిన ఓటు చెరువు సప్లై కాలువను ఆక్రమించి లేఔట్ నిర్మాణంచేసి ఇళ్లను కడుతున్నారని దీనిద్వారా పంచాయతీలోని ఒడ్డుపాలెం, హరిజనవాడకు సంబంధించిన డ్రైనేజీ నీళ్లు బ్లాక్ చేయడం ద్వారా బావులు, పంచాయతీ కుళాయిలు త్రాగు నీరు కలుషిత మైపోయి గ్రామస్థులకు జ్వరాలు, విరోచనాలు ప్రభలుతున్నాయని గ్రామస్థులు వాపోయారు. ఇది బ్రిటిష్ కాలం నాటి నుండి సన్న చిన్నకారు రైతులు పండించుకునే పంటలకు ఈ కాలువ ద్వారా పొలాలకు నీరు రావడం జరుగుతుందని అదేవిధంగా చెందోడు పంచాయతీలోని ఒడ్డుపాలెం హరిజనవాడ, ఊరుకు సంబంధించిన డ్రైనేజీ నీరు కూడా ఇదే కాలువ ద్వారా రావడం జరుగుతుందని ఇప్పుడు అక్రమంగా వేసినటువంటి ఈలేఔట్ కడుతున్నటువంటి ఇల్లు కాలువను పోర్చడం ద్వారా ఎక్కడి మురుగునీరు అక్కడే ఆగిపోవడం జరిగింది అని లేఅవుట్ యజమానితో ఇల్లు కడుతున్న యజమానితో అనేకమార్లు చెప్పి చూసిన వారు నిమ్మకు నీరుతున్నట్టు వ్యవహరించడంతో ఈరోజు గ్రామస్తులు జెసిపి ద్వారా ఆ కాలవ పూడిక తీతను తీయడం జరిగింది. ఇదే సమస్యపై మండల ఎంపిడిఓకి, పంచాయతీ సెక్రటరీకి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి తెలియపరచమని ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామస్థులకు న్యాయం చేయాలనీ కోరుతున్నారు.

# సంపాదకీయం

## లెబనాన్ పశ్చిమాసియా శత్రుత్వాల సమిధ

కొన్ని దేశాలు నిజంగా దురదృష్టకరమైనవి. భౌగోళిక స్థానం, జాతుల సమ్మేళన సమాజం లేదా వ్యూహాత్మక వనరుల దృష్ట్యా అవి భౌగోళిక రాజకీయ విరోధాలు, పరోక్ష యుద్ధాలకు నెలవులై దుర్విధి పాలవుతున్నాయి. బలహీన రాజ్య వ్యవస్థ, రాజ్యంలో రాజ్యంగా పని చేస్తూ తరచూ విదేశీ ప్రభుత్వాల ఆర్థిక, ఆయుధ అండదండలతో కొనసాగుతున్న శక్తిమంతమైన మిలీషియాలు, పదే పదే విదేశీ సైనిక జోక్యాలతో అతలాకుతలం కావడం ఈ దురదృష్టకర దేశాల నిరంతర చరిత్ర. అటువంటి దౌర్భాగ్య, విషాదకర చరిత్రకు ఒక ప్రామాణిక ఉదాహరణగా నిలిచే దేశం అఫ్ఘానిస్థాన్. 19వ శతాబ్ది గ్రేట్ గేమ్, 20వ శతాబ్ది ప్రచ్ఛన్న యుద్ధం, 21వ శతాబ్ది సెప్టెంబర్ 11 ఉగ్రవాద దాడుల అనంతరం విదేశీ సైనిక జోక్యాలు అఫ్ఘాన్ చరిత్రను రక్తసిక్తం చేశాయి. ద్వితీయ కాంగో యుద్ధం ఆఫ్రికా ప్రపంచ యుద్ధంగా సుప్రసిద్ధమయింది. సిరియన్ అంతర్యుద్ధంలో అనేక దేశాల ప్రమేయం ఉన్నది. అమెరికా, రష్యా, ఇరాన్, తుర్కియేలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానే ఆ పశ్చిమాసియా దేశ ప్రస్తుత పరిస్థితికి కారణమయ్యాయి. ప్రాంతాలు వేరు కావచ్చు, వాటి దురదృష్ట గాథల తీరుతెన్నూ ఒకటే: స్థానిక సంఘర్షణలను ప్రోత్సహించడం, సొంత ప్రయోజనాలకు వాటిని ఉపయోగించుకోవడం, అగ్రరాజ్యాల లక్ష్యాలకు అనుగుణంగా ఆ ఘర్షణలు సుదీర్ఘంగా కొనసాగేలా చేయడం. ఇలాంటి దురదృష్టకర చరిత్ర ఉన్న దేశాల జాబితాలో లెబనాన్‌కు ఒక శాశ్వత స్థానం ఉన్నది. చాలా ఇటీవల తన పొరుగు దేశం సైనిక దాడులకు గురైన, ఇంకా వాటిని చవి చూస్తూనే ఉన్న దేశమది. ఆ పొరుగు దేశం ఇజ్రాయెల్. గత యాభై సంవత్సరాలలో ఈ దేశం లెబనాన్‌ను ఆక్రమించుకోవడం లేదా తీవ్ర విధ్వంసానికి గురి చేయడం ఇది అక్షరాలా ఏడవసారి. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ జరిగినప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులు కొనసాగాయి. వాటిని ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశాడు. ఇరాన్ అండదండలు అన్ని విధాలా ఉన్న మిలిటెంట్ గ్రూప్ హెజ్బొల్లాను లెబనాన్ నుంచి పూర్తిగా తుడిచిపెట్టడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఈ దాడులకు పూనుకున్నది. ఇజ్రాయెల్ దురాగతానికి 2000 మందికి పైగా లెబనీస్ ప్రజలు మరణించారు. పది లక్షల మందికి పైగా పూర్తిగా నిరాశ్రయులయ్యారు. లెబనాన్ దురదృష్టం అంతులేనిది. మానవతనే అది పరిహసిస్తోంది. పశ్చిమాసియాలోని కొద్ది ప్రజాస్వామ్య సమాజాలలో అది ప్రముఖమైనది. ఇతర దేశాల యుద్ధాలకు పదే పదే నెలవు అవుతున్న విషాద భూమి. తాను కారణం కాని ఆ ఘర్షణలు ఒక నిర్ణయాత్మక ముగింపునకు రావడం అరుదు; ఘర్షణలు ఆగుతాయి- - తాత్కాలికంగా; మిలీషియాలు యథావిధిగా సాయుధ బలోపేతమవుతాయి; రాజ్య వ్యవస్థ బలహీనమవుతుంది. ఘర్షణలను నిలిపివేస్తారు కానీ పరిష్కరించరు. ఈ ఎడతెగని వాస్తవాలు లెబనాన్ విషాదాన్ని మరింత దుర్భరం చేస్తున్నాయి. ఒట్టోమన్ సామ్రాజ్య శిథిలాల నుంచి 1920లో లెబనాన్ ప్రభవించింది. శతాబ్దానికి పైగా మనుగడలో ఆ గడ్డపై శాంతి వర్ధిల్లిన కాలం చాలా అరుదు. లెబనాన్ చరిత్రలో శాంతి సౌభాగ్యాలు ఏమాత్రమన్నా వర్ధిల్లడమనేది 1950లు, 1960ల్లో మాత్రమే జరిగింది. ఆ దశాబ్దాలకు ముందు, తరువాత ఈ దురదృష్టకర దేశం యుద్ధం, అంతర్యుద్ధం, 'యుద్ధమూ లేని, శాంతీలేని' అల్లకల్లోల పరిస్థితుల మధ్య అల్లాడిపోతూనే ఉంది. నిరంతర అస్థిరత పెట్టుబడులను నిరోధించింది, విదేశీ సహాయాన్ని ఎంతకూ అరకొరగా ఉంచివేసింది. ఫలితంగా రుణ భారం భరించలేని రీతికి పెరిగిపోయింది. 1982 లెబనాన్ యుద్ధం అనంతరం హెజ్బొల్లా, ఇరాన్, ఇజ్రాయెల్‌లు నిరవధికంగా రగిలిస్తున్న సంక్షోభం ఇజ్రాయెల్ తాజా విధ్వంసక దాడులతో మరింతగా విషమించింది. లెబనాన్ దక్షిణ ప్రాంతాల నుంచి పాలస్తీనా విమోచన సంస్థ (పీఎల్‌ఓ)ను గెంటివేసేందుకు నాలుగున్నర దశాబ్దాల క్రితం ఇజ్రాయెల్ ఆక్రమించుకున్నది. 1982కు పూర్వం కూడా ఇజ్రాయెల్-పాలస్తీనియన్ ఘర్షణల కారణంగానే కాకుండా విస్తృత అరబ్-ఇజ్రాయెలీ విరోధాల వల్ల కూడా లెబనాన్ పరోక్ష యుద్ధాలకు నెలవుగా నలిగిపోయింది. పాలస్తీనా విమోచన సంస్థకు మద్దతునిచ్చిన సిరియా, లెబనాన్‌లో రాజ్యంలో రాజ్యంగా పీఎల్‌ఓ సువ్యవస్థితమయ్యేందుకు అన్ని విధాలా తోడ్పడింది. అరబ్ దేశాల మధ్య శత్రుత్వాల కారణంగా సద్దాం హుస్సేన్ నేతృత్వంలోని ఇరాక్, హఫేజ్ అల్ - అస్సద్ నేతృత్వంలోని సిరియా పరస్పరం పొసగని మిలీషియాలకు పోటీపడి మద్దతు నివ్వడంతో లెబనాన్‌లో పరిస్థితులు రావణకాష్ఠంలా పరిణమించాయి. లెబనాన్‌లో ఈ ఎడతెగని సంక్షోభానికి ఒక కారణం ఆ దేశంలోని సంక్లిష్ట సామాజిక వ్యవస్థే అని చెప్పవచ్చు. లెబనాన్ సమాజంలో కేథలిక్కులు అయిన మారోనైట్లతో పాటు క్రైస్తవ మతంలోని అన్ని శాఖల వారూ ఉన్నారు. వారితో పాటు సున్నీలు, షియాలు, పాలస్తీనియన్లు ఇంకా డ్రూజ్‌లు ఉన్నారు. అధికారానికి, ఇతర ప్రయోజనాలు సాధించుకోవడానికి ఈ మత బృందాల మధ్య పోటీ, పోరాటాలే 1975 నుంచి 1990దాకా సాగిన అంతర్యుద్ధానికి దారితీశాయి. బాహ్య జోక్యాలు ఈ సామాజిక చీలికలను సృష్టించనప్పటికీ వాటిని మరింత తీవ్రతరం చేశాయి. 'సిరియాలోని లౌకికవాద బాతిస్ట్ ప్రభుత్వం హెజ్బొల్లాను ఒక బలమైన శక్తిగా ప్రభవింపజేయడంలో ఇరాన్‌కు తోడ్పడింది... లెబనాన్‌లో ఇజ్రాయెల్‌కు అనుకూలంగా ఉన్న రాజకీయపక్షం మారోనైట్ క్రైస్తవుల నాయకత్వంలోనిది. అది 1930ల్లో జర్మన్ నాజీలు, ఇటాలియన్ ఫాసిస్టుల స్ఫూర్తితో ఏర్పడిన పార్టీ' అని లెబనీస్ వ్యవహారాల అధ్యయనవేత్త ఒకరు పేర్కొన్నారు. 1982-2000 సంవత్సరాల మధ్య దక్షిణ లెబనాన్‌లో చోటు చేసుకున్న ఘర్షణల్లో ఇజ్రాయెల్‌కు ప్రధాన విరోధిగా హెజ్బొల్లా ఆవిర్భవించింది.

# జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలం

### - పల్లా శ్రీనివాస్‌కు గంట్ల అభినందనలు

### - ఘనంగా సత్కరించి సింహాద్రినాథుడి జ్ఞాపిక బహుకరణ





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఏపీ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఇక్కడ సీతంపేట రాజేంద్రనగర్ నివాసంలో ఆయనను జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మర్యాదపూర్వకంగా కలు సుకుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సింహాద్రినాథుడి జ్ఞాపికను పల్లా శ్రీనివాస్‌కు అందజేసి ఆ అప్పన్న ఆశీస్సులు ఎల్లవేళలా ఆయనపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను గంట్ల శ్రీనుబాబు ప్రస్తావించగా వీలైనంత త్వరలో ఆయా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వ పరంగా చర్యలు చేపట్టినట్లు పల్లా శ్రీనివాస్ వివరించారని గంట్ల చెప్పారు. జర్నలిస్టుల సొంత ఇంటి కలను సాకారం చేయాలని కోరడం జరిగిందన్నారు. రెండోసారి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన పల్లా శ్రీనివాసును గంట్ల ఈ సందర్భంగా అభినందించారు.

# విశాఖ జిల్లా గౌరవ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌ని కలిసిన సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ గౌరవ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ని దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ కలెక్టరేట్ చాంబర్లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజవర్గం సంబంధించిన పలు అంశాలను వివరించడంతో పాటు నియోజవర్గం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదే విధంగా పెండింగ్లో ఉన్న పలు అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయడానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ఈ సందర్భంగా నూతనంగా విశాఖ నగరం విచ్చేసిన కలెక్టర్‌కి శాలువా వేసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలి

### - అగ్నిమాపక శాఖ అధికారి డి వి రమణయ్య





**గూడూరు, (రాజధాని వార్తలు):** విద్యార్థి దశ నుండే అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని గూడూరు అగ్నిమాపక శాఖ అధికారి డివి రమణయ్య సూచించారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని వి ఎస్ ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి అగ్నిమాపిత పరికరాలు చేస్తూ పరికరాలు అవి పనిచేసే విధానాన్ని వివరించారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ వైరింగ్‌నందు లూజ్ కరెక్షన్ లేకుండా ఐఎస్ఐ మార్క్ కలిగిన పరికరాలను వాడాలని పాఠశాల యాజమాన్యాలకు కూడా చూపించారు. బహుళ అంతస్తులు భవనములు కలిగినప్పుడు జరిగే అగ్ని ప్రమాదాల నుండి క్షతగాత్రులను ఏ విధంగా కాపాడాలనే విషయంపై ప్రాక్టికల్‌గా చూపించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తొలిదశలో గుర్తిస్తే సి ఓ 2 యాక్సింగ్ విషర్, డీసీపీ ఏక్సింగ్ విషర్‌లతో నష్ట నివారణను తగ్గించేందుకు డెమో రూపంలో చూపించారు. రంగస్థలం విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వి ఎస్ ఆర్ స్కూల్ కరస్పాండెంట్ బాలకృష్ణంరాజు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఉపాధ్యాయులు విద్యార్థులతో పాటు అగ్నిమాపక సిబ్బంది ఎల్ ఎఫ్ ఎస్ శ్రీనివాసులు ఎల్ ఎఫ్ కే నారాయణ డిఓపి ఎం చంద్రశేఖర్ ఎఫ్ఎం జి మహేంద్ర, ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తుల రక్షణపై అవగాహన ఉండాలి

### - ఎస్ డి ఆర్ ఎఫ్ 9వ బెటాలియన్ కమాండెంట్ సాయి ప్రసాద్




**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** విద్యార్థులు ప్రకృతి విపత్తులు రక్షించుకోవడానికి అవగాహన వెంకటగిరి నైన్త్ బెటాలియన్ కమాండెంట్ సాయి ప్రసాద్ సూచించారు. శ్రీకాళహస్తి రూరల్ మండలం వేలంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెంకటగిరి బెటాలియన్ ఎస్ డి ఆర్ ఎఫ్ 9వ బెటాలియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు తమను ఎలా రక్షించుకోవాలో అనే విషయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ సాయి ప్రసాద్ తీవ్రమైన తుఫానులు వరదలు తీవ్రమైన ఎండలు వడగాలులు వచ్చినప్పుడు తీసుకోవా ల్సిన జాగ్రత్తలు ఎలా ప్రకృతి విపత్తుల నుండి తమను రక్షించుకోవాలో ప్రమాదాల బారిన పడకుండా ఏమి చేయాలో ఏం చేయకూడదు అవగాహన కార్యక్రమం విద్యార్థులకు గ్రామస్తులకు చక్కగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక, ఉపాధ్యాయులు బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్, ఇన్స్ట్రక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మరిడమ్మ అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో పూజలు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మ వారి ఆలయంలో శుక్రవారం శ్రీ మరిడమ్మ అమ్మవారికి బంగారు, వెండి పుష్పలతో పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కే విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మరిడమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం జరిపి బంగారు, వెండి పుష్పములతో ఆసాదులు ప్రత్యేక పూజ, అర్చన కార్యక్రమములు చేపట్టారు. పూజలో భాగంగా వేద పారాయణ చేపట్టగా భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల పాల్గొన్న భక్తులకు పులిహోర ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజల్లో ఆలయ సిబ్బంది, అర్చకులు భక్తులకు సేవలు అందించారు.

# సేవా కార్యక్రమాలతో దొరబాబు జన్మదిన వేడుకలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు జన్మదిన వేడుకలు సామర్లకోట పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. పలు సేవా కార్యక్రమాల ద్వారా దొరబాబు జన్మదిన వేడుకలు పట్టణ వైసిపి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మెహర్ కాంప్లెక్స్ సెంటర్‌లో వైసిపి సీనియర్ నాయకులు దవులూరి సుబ్బారావు వేడుకల్లో పాల్గొని కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదచారులకు మజ్జిగను, రాగి జావ, బార్లీ పంపిణీ చేశారు. అనంతరం స్టేషన్ సెంటర్‌లో రిక్షా కార్మి కులకు, ఆటో డ్రైవర్‌లకు వస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే పెద్దాపురం పట్టణంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో దొరబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన గృహం వద్ద కేకును కోసి, మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాగా సురేష్ కుమార్, ఊబా జాన్ మోజెస్, ఆవాల లక్ష్మీనారాయణ, మన్యం చంద్రరావు, ఇరుసుమళ్ళ సాయి, పాలికి కుసుమ చంటిబాబు, లింగం శివప్రసాద్, జట్ల మోహన్, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** నిర్మాణంలో ఉన్న ఇంటిని తడుపుచుండగా విద్యుత్ షాక్ తగిలి సామర్లకోట పట్టణ పరిధిలోని కోట బజార్ ప్రాంతానికి చెందిన మోర్త శీను (40) అనే వ్యక్తి మృతి చెందాడు. కుటుంబీకులు, స్థానికులు అందించిన వివరాలు ప్రకారం శుక్రవారం ఉదయం సామర్లకోట జీ రాగంపేట రోడ్డులో గల జగన్న కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిని నీళ్లతో తడుపుతుండగా విద్యుత్ షాక్ తగిలింది. దానితో అతనిని హుటాహుటిన బంధువులు, స్థానికులు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే శ్రీను మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు బంధువులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటి వద్ద వున్న విద్యుత్ లైన్ లేదా ఇం టికి వున్న విద్యుత్ మీటర్ నుంచి కరెంట్ సరఫరా అవడంతో విద్యుత్ షాక్ తగిలి ఉండవచ్చునని స్థానికులు, బంధువులు అభిప్రాయ పడుతున్నారు.

# కొడుకులతో కాలక్షేపం.. నయనతార పిల్లల్ని చూసారా?





లేడీ సూపర్ స్టార్ నయనతార వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా తన భర్త విగ్నేష్ శివన్, పిల్లలు ఉయిర్ మరియు ఉలగమ్‌లతో కలిసి దిగిన క్యూట్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలలో నయన్ ముఖంలోని చిరునవ్వు, ఆ ఫ్యామిలీ బాండింగ్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట ట్రెండింగ్‌లో ఉన్నాయి. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా ఫ్యామిలీకి టైమ్ ఇవ్వడంలో తను ముందుంటానని నయన్ మరోసారి నిరూపించింది. ఆ విశేషాలు చూద్దాం.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో నయనతార, విగ్నేష్ శివన్ జంటకు ఒక ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంది. దాదాపు ఏడేళ్ల పాటు పీకల్లోతు ప్రేమలో మునిగి తేలిన ఈ జోడీ, 2022 జూన్‌లో పెళ్లి పీటలెక్కిన సంగతి తెలిసిందే. పెళ్లయిన తర్వాత కూడా వీరిద్దరూ కెరీర్ మరియు పర్సనల్ లైఫ్‌ను ఎంతో అద్భుతంగా బ్యాలెన్స్ చేస్తున్నారు. ఇక తాజాగా బయటకు వచ్చిన ఫోటోలలో ఈ జంట మధ్య ఉన్న అన్యోన్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకరికొకరు తోడుగా ఉంటూ, ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్న ఈ క్యూట్ కపుల్‌ను చూసి నెటిజన్లు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. నయనతారకు తన కవల పిల్లలు ఉయిర్ మరియు ఉలగమ్ అంటే ప్రాణం. వారి పేర్లలోనే ప్రపంచాన్ని చూసుకునే నయన్, షూటింగ్స్ నుండి ఏమాత్రం విరామం దొరికినా పిల్లలతోనే గడుపుతుంది. ప్రస్తుతం ఈ బుజ్జిగాళ్లకు రెండేళ్లు నిండాయి. తాజా ఫోటో షూట్‌లో పిల్లలతో కలిసి ఆడుకుంటూ నయన్ ఇచ్చిన ఫోజులు నెటిజన్ల మనసు గెలుచుకుంటున్నాయి. తన పిల్లల అల్లరిని, వారి ఎదుగుదలను ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకునే నయనతార, ఒక బాధ్యతగల తల్లిగా అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఇక ఆ ఫోటోల్లోని నయన్ స్మైల్ చూస్తుంటే ఆమె ఎంత సంతోషంగా ఉందో అర్థమవుతోంది. కెరీర్ విషయానికొస్తే, నయనతార చేతిలో ఇప్పుడు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్‌తో కలిసి నటిస్తున్న పాన్-ఇండియా మూవీ 'టాక్సిక్' పై భారీ అంచనాలు ఉన్నాయి. దీనితో పాటు 'డియర్ స్టూడెంట్స్', 'మూక్కుత్తి అమ్మన్ 2', 'మన్నాంగట్టి' మరియు బాలకృష్ణ సినిమా 'NBK111' వంటి క్రేజీ సినిమాలతో 2026-27 లో ఆమె బిజీగా ఉండబోతోంది. ఈ ఏడాది ఇప్పటికే చిరంజీవి సరసన నటించిన 'మన శంకరవర ప్రసాద్' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న నయన్, త్వరలో బాలీవుడ్ ప్రాజెక్టులతోనూ సందడి చేయబోతోంది. నయనతార అంటే కేవలం గ్లామర్ మాత్రమే కాదు, అంకితభావానికి కూడా నిదర్శనం. ఒకవైపు స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూనే, మరోవైపు తన సొంత ప్రపంచమైన కుటుంబాన్ని ఎంతో ప్రేమగా చూసుకుంటోంది. తాజాగా వైరల్ అవుతున్న ఈ ఫ్యామిలీ ఫోటోలు ఆమె అభిమానులకు కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి. సినిమాల్లో పవర్ ఫుల్ పాత్రలు పోషించే నయన్, ఇంట్లో మాత్రం చాలా సాదాసీదాగా, తన పిల్లలతో చిన్నపిల్లలా కలిసిపోవడం విశేషం. ఇలాగే మరిన్ని సక్సెస్‌లతో, సంతోషంతో నయన్ తన కెరీర్‌ను కొనసాగించాలని కోరుకుందాం!


# నెట్‌ఫ్లిక్స్‌తో నిఖిల్ 'స్వయంభు' డీల్... ఇండస్ట్రీలో హాట్ టాపిక్!



టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కార్తికేయ 2 తో పాన్ ఇండియా హీరోగా మారిపోయారు. ఇప్పుడు 'స్వయంభు' అనే భారీ పీరియాడిక్ డ్రామాతో మన ముందుకు వస్తున్నాడు. ఈ సినిమా డిజిటల్ రైట్స్ విషయంలో నెట్‌ఫ్లిక్స్ ఒక మైండ్ బ్లోయింగ్ ఆఫర్ ఇచ్చింది. థియేటర్ కలెక్షన్లను బట్టి ఓటీటీ రేటును నిర్ణయించే ఈ సరికొత్త ఒప్పందం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ డీల్ వల్ల నిర్మాతలకు లాభమా లేక నష్టమా? అసలు ఈ కొత్త ట్రెండ్ వెనుక ఉన్న మర్మమేంటో ఇప్పుడు చూద్దాం. నిఖిల్ హీరోగా భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న 'స్వయంభు' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సాధారణంగా ఒక సినిమా రిలీజ్‌కు ముందే ఓటీటీ హక్కులు భారీ ధరలకు అమ్ముడవుతుంటాయి. కానీ, ఈ సినిమా కోసం నెట్‌ఫ్లిక్స్ ఒక వినూత్నమైన ఆఫర్‌ను నిర్మాతలకు ఇచ్చిందట. ఇక ఈ చిత్రం థియేటర్లలో ఎంత 'నెట్ కలెక్షన్' సాధిస్తుందో, అందులో సరిగ్గా 50 శాతం మొత్తాన్ని డిజిటల్ రైట్స్ కింద చెల్లిస్తారట. అంటే బాక్సాఫీస్ వద్ద సినిమా ఎంత పెద్ద హిట్ అయితే, ఓటీటీ సంస్థ నుండి అంత ఎక్కువ సొమ్ము నిర్మాతలకు అందుతుందన్నమాట. గతంలో హీరో క్రేజ్‌ను బట్టి కళ్లు మూసుకుని కోట్ల రూపాయలు కుమ్మరించిన ఓటీటీ సంస్థలు, ఇప్పుడు రూటు మార్చాయి. భారీ రేట్లకు కొన్న సినిమాలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఆశించిన స్థాయిలో వ్యూస్‌ను రాబట్టలేకపోవడంతో ఓటీటీ దిగ్గజాలు నష్టాల్లో కూరుకుపోయాయి. అందుకే ఇప్పుడు 'పర్ఫార్మెన్స్ క్లాజ్' అనే పద్ధతిని తీసుకొచ్చాయి. ఇక థియేటర్లలో ఏ సినిమాకైతే జనం బ్రహ్మరథం పడతారో, అదే సినిమాకు ఓటీటీలోనూ మంచి ఆదరణ ఉంటుందని నెట్‌ఫ్లిక్స్ గట్టిగా నమ్ముతోంది. అందుకే ఈ 'సగం కలెక్షన్ల' ఆఫర్ తెరపైకి వచ్చింది. ఈ సరికొత్త ఒప్పందం టాలీవుడ్‌లో ఒక కొత్త ట్రెండ్‌కు దారితీసేలా కనిపిస్తోంది. ఇది నిర్మాతలకు ఒక రకమైన రిస్క్ అయినప్పటికీ, సినిమా కంటెంట్‌పై గట్టి నమ్మకం ఉంటే మాత్రం జాక్‌పాట్ కొట్టినట్లే.

ఒకవేళ బాక్సాఫీస్ వద్ద సినిమా 100 కోట్లు వసూలు చేస్తే, ఓటీటీ నుండి అదనంగా మరో 50 కోట్లు వచ్చే అవకాశం ఉంటుంది. ఇక ఈ మోడల్ సక్సెస్ అయితే భవిష్యత్తులో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి సినిమాకు 'థియేట్రికల్ హిట్' అనేది ఓటీటీ బిజినెస్‌ను శాసించే ప్రధాన అంశంగా మారుతుంది. సంయుక్త మీనన్, నభా నటేష్ వంటి ముద్దుగుమ్మలు నటిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే చిత్ర యూనిట్ రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశం ఉంది. కంటెంట్ బాగుంటే ఆడియన్స్ ఎలాగూ ఆదరిస్తారు, తద్వారా ఓటీటీ రేటు కూడా పెరుగుతుందనే ధీమాతో చిత్ర యూనిట్ ఉన్నట్లు తెలుస్తోంది. మరి నిఖిల్ తన 'స్వయంభు'తో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో, నెట్‌ఫ్లిక్స్‌ను ఎంత మేరకు లాభాల్లోకి నెడతాడో వేచి చూడాలి. ఇక మొత్తానికి ఈ డీల్ మాత్రం ఇండస్ట్రీలో ఒక పెద్ద సెన్సేషన్!

# 'పాపం ప్రతాప్' సెట్లో కెళ్లాక రాశి షాక్ అయ్యారట!



హీరోయిన్‌గా ఒక దశలో హాట్ ఫేవరేట్‌గా నిలిచిన నటి రాశి. అందం, అభినయంతో ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుని ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ ఫేవరేట్ అనిపించుకుంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో క్రేజీ స్టార్లతో నటించిన మంచి పాపులారిటీని సొంతం చేసుకున్నారు. ఆ తరువాత అసిస్టెంట్ డైరెక్టర్‌ని వివాహం చేసుకుని సినిమాలకు కొంత కాలం దూరంగా ఉంటూ వస్తున్న రాశి సీరియల్స్‌లోనూ అమ్మ పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. మళ్లీ వెండితెరపై సీనియర్ స్టార్‌గా ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో నటిస్తూ వస్తున్నారు. సినిమాల్లోనూ మళ్లీ నటించడం మొదలు పెట్టిన రాశి తన క్రేజ్‌కు తగ్గ క్యారెక్టర్లని సొంతం చేసుకోలేకపోతున్నారు. తాజాగా తిరువీర్ కథనాయకుడిగా నటించిన -పాపం ప్రతాప్- సినిమాలో హీరో తల్లిగా కనిపించి అలరించారు. అయితే ఈ క్యారెక్టర్ గురించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించి షాక్ ఇచ్చారు రాశి. ఇప్పుడున్న ఆర్టిస్ట్‌ల పేర్లు నాకు తెలియదు. ఆర్టిస్ట్‌ని చూస్తే గుర్తు పడతా. ఇందులో నటించిన అజయ్ ఘోష్ రంగస్థల నటులు. అయితే ఆయన పేరు నాకు తెలియదు. మనిషి చూస్తే గుర్తు పడతాను. దర్శకుడు నాకు కథ చెప్పినప్పుడు నా పక్కన అజయ్ గారు నటిస్తున్నారంటే టాల్‌గా ఉండే అజయ్ అనుకున్నాను. ఆయనే అనుకుని నేను ఫిక్స్ అయ్యాను. ఫస్ట్ డే లొకేషన్‌లోకి వెళ్లగానే మేకప్ పూర్తి చేసుకుని జడ వేసుకున్నాను. అజయ్ కొంచెం యంగ్‌గా ఉంటారు. అందుకే నేను జడ వేసుకున్నాను. అయితే క్యారవాన్‌లోని వచ్చిన దర్శకుడు మీరు యంగ్‌గా ఉన్నారు అన్నాడు. నా అసిస్టెంట్ -ఆమె హీరోయినే కదా- అన్నాడు. అంటే మీరు మదర్‌లా కనిపించట్లేదని చెప్పాడు డైరెక్టర్. అయితే నేను ఇప్పుడు ఏం చేయాలో చెప్పండి అన్నాను. వెనకాల జడ కాకుండా ముడి వేసుకోండి అన్నాడు. ఓకే అని అలాగే వేసుకున్నాను. సెట్‌లోకి వెళ్లి నేను అజయ్‌ని వెతుకుతున్నాను. అయితే అక్కడ ఓ చైర్‌లో అజయ్ ఘోష్ గారు కూర్చుని ఉన్నారు. ఆయనని చూసి ఓకే ఈయన మా మామయ్యగారి క్యారెక్టరా? ఏంటీ అనుకున్నాను. ఇంతలో ఒకమ్మాయి వచ్చి ఏంటమ్మా వెతుకుతున్నారు? అని అడిగింది. అదే అజయ్ గారు ఎక్కడా అని వెతుకుతున్నాను అన్నాను. ఆయనే కదా మేడం అజయ్ ఘోష్ అని తను చూపించింది. ఆయనే అని తెలిసి షాక్ అయ్యాను. ఇదేంటి అని డైరెక్టర్‌ని అడిగితే అప్పట్లో చిన్న వయసులోనే పెళ్లిళ్లు జరుగుతుంటాయి కదా? అన్నారు. అజయ్ ఘోష్ గారు ఫెంటాస్టిక్ ఆర్టిస్ట్. ఆయనతో ఫస్ట్ టైమ్ వర్క్ చేశాను. ఆయన సింగిల్ టేక్ ఆర్టిస్ట్. అది స్టేజ్ ఫెర్ఫార్మెర్స్‌కే ఉంటుంది. హిలేరియస్ కామెడీని అన్ ద స్పాట్ ఇంప్రూవ్ చేసి చేశారు. ఏ విషయంలోనూ కాంప్రమైజ్ కారు ఆయన- అంటూ అజయ్ ఘోష్ గురించి చెప్పుకొచ్చారు.

# శ్రుతిహాసన్ కి పెళ్లి సంబంధాలు చూస్తున్నారా?



శ్రుతి హాసన్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో తాను మల్టీట్యాలెంటెడ్ బ్యూటీ అని కెరీర్ ఆరంభంలోనే చాటి చెప్పింది. లెజెండ్ కమల్ హాసన్ వారసురాలిగా చిత్ర పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అంచలంచెలుగా ఎదిగింది. సౌత్ సహా బాలీవుడ్‌లోనూ అనతి కాలంలోనే సినిమాలు చేసి అన్ని పరిశ్రమల్లోనూ తనదైన ముద్ర వేసింది. వ్యక్తిగత జీవితంలోనే శ్రుతిహాసన్ ప్రేమాయణాలు నడపడంలోనూ తక్కువేం కాదని ప్రూవ్ చేసింది. తొలుత విదేశీయుడు మైఖెల్ కోర్సలేతో కొన్నాళ్ల పాటు డేటింగ్ చేసింది. అతడినే పెళ్లాడాలనుకుంది. ఈ క్రమంలో మైఖెల్ ను డాడ్ కు సైతం పరిచయం చేసింది. కానీ ఎందుకనో ఆ బంధం పెళ్లి వరకూ దారి తీయలేదు. అటుపై కొంత గ్యాప్ తీసుకుని ముంబైకి చెందిన శంతను హాజారికాతోనూ డేటింగ్ చేసింది. తొలి వైఫల్యం నేపథ్యంలో శంతను పెళ్లాడుతుందని అంతా భావించారు. కానీ ఈ బంధం కూడా మధ్యలోనే వీగిపోయింది. అప్పటి నుంచి అమ్మడు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉంటూ వృత్తిగత జీవితంపైనే దృష్టి పెట్టింది. సినిమాలు తప్ప మరో ఆలోచన లేకుండా పని చేస్తోంది. ఈ నేపథ్యంలో శ్రుతి హాసన్ గురించి ఓ వార్త కోలీవుడ్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కమల్ హాసన్ తన గారాల పట్టి కోసం సరైన వరుడిని వెతికే పనిలో పడ్డారని వార్తలొస్తున్నాయి. ఇప్పటికే కొన్ని సంబంధాలు చూసారని ప్రచారం జరుగుతోంది. సాధారణంగా వ్యక్తిగత విషయాలపై చాలా స్పష్టంగా ఉండే కమల్ కూతురి భవిష్యత్తు గురించి ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. శ్రుతి హాసన్‌కు ఇప్పటికే 40 ఏళ్లు నిండాయి. పెళ్లి విషయంలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా కమల్ బలమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కమల్ హాసన్ తన మిత్రులు, బంధువుల ద్వారా మంచి సంబంధాలను అన్వేషి స్తున్నారుట. బయట కుర్రాడు కంటే తెలిసిన కుర్రాడైతే బాగుంటుందనే క్రమంలోనే కమల్ తెలిసిన వాళ్ల ద్వారా పెళ్లి కొడుకును వెతుకుతున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత జీవితంలో కూడా కమల్ హాసన్ చాలా సవాళ్లు ఎదుర్కొన్నారు. వివాహం అనే జీవితంలో కమల్ చాలా కుదుపులకు లోనయ్యారు. మొదటి భార్యతో విడాకులు ..ఆ తర్వాత నటి గౌతమ్‌తో రిలేషన్ షిప్ వీగిపోవడం తెలిసిందే.

# పోషణ పక్వాడాతో తల్లి బిడ్డలకు పోషణ : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి రాజేశ్వరి







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** తల్లి బిడ్డల సంక్షేమమే పోషణ పక్వాడ ముఖ్య ఉద్దేశ్యం అని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం. రాజేశ్వరి విలేకరులకు తెలియజేశారు. మండలంలోని మరుపల్లి గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమంపై శుక్రవారం నాడు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ పిల్లలు ఫోన్ చూసే సమయాన్ని తగ్గించడంలో తల్లిదండ్రులు, సమాజం పాత్ర ఎంతో కీలకం అని అన్నారు. పిల్లలకు ఆట ఆధారిత విద్యను తొలి నాళ్లలోనే తల్లిదండ్రులు అలవాటు చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మరుపల్లి సెక్టార్ పర్యవేక్షకురాలు శ్యామలత, సెక్టార్ లీడర్లు నారాయణమ్మ, త్రివేణి, అంగన్వాడీ కార్యకర్తలు పుష్ప, మంగ, అన్నపూర్ణ, సన్యాసమ్మ, సహాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అత్యవసర పనులు వెంటనే ఆమోదం పొంది పూర్తవ్వాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అవసరమైన అత్యవసర పనులకు వెంటనే ఆమోదం పొంది, పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)లో ప్రజలకు మెరుగైన సేవలు అందించుటకు చేపట్టవలసిన అభివృద్ధి పనుల గూర్చి జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ చాంబర్లో అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యవసరంగా చేపట్టవలసిన పనులకు త్వరితగతిన పాలనాపరమైన అనుమతులు పొందాలని, పనులను వెంటనే మొదలుపెట్టాలని ఆదేశించారు. ఆసుపత్రిలో షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా విద్యుత్ వైరింగ్ చేయాలని, వాటర్ పైప్ లైన్ లీకేజీ లేకుండా అరికట్టాలని, డ్రైనేజీ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన నీటిని నిలువ చేయుటకు అదనపు సంపులు నిర్మించాలన్నారు. ఆసుపత్రికి నీటి కొరత లేకుండా ప్రతిరోజు సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మజ, ఎ పి డి సి ఎల్ డిప్యూటీ ఇంజనీర్ కుమార్ పాల్గొన్నారు.

# బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేయండి


**- శత శాతం విద్యార్థులు నమోదు కావాల్సిందే : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి బడి పిలుస్తోంది ప్రత్యేక ప్రవేశోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, జిల్లాలో శత శాతం విద్యార్థుల నమోదు సాధించాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పష్టం చేసారు. శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 17 నుండి 23 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రతి అర్హత గల బాల,బాలిక ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు పూర్తిచేసుకున్న పిల్లలు, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, డ్రాప్‌అవుట్స్, స్కూల్‌కు వెళ్లని పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. స్లమ్ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు వంటి సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి, వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాల పరిధిలో సర్వే నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి పిల్లల వివరాలు సేకరించి, ప్రవేశాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా స్థాయి నుండి పాఠశాల స్థాయి వరకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, జిల్లా పరిషత్ సీఈవో బి.వి.సత్యనారాయణ, ఐ.సి.డి.ఎస్ పీడీ బాలమణి, డిపిఓ, ఎంఈఓలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నెలాఖరు నాటికి 100% ఆధార్ నమోదు పూర్తి కావాల్సిందే

**- బాల్య వివాహాలు లేకుండా పటిష్ట చర్యలు - టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులు ఉండరాదు : ఐసీడీఎస్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం**



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్ ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి శత శాతం ఆధార్ నమోదు పూర్తి కావాల్సిందేనని తేల్చి చెప్పారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ అధికారులు, సూపర్వైజర్లు మరియు ఆధార్ నమోదు ఆపరేటర్లతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలందరికీ వంద శాతం ఆధార్ నమోదు పూర్తి కావాలని, ఇందులో ఎటువంటి జాప్యం సహించబోమని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నమోదు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. అవసరమైతే ఆయా గ్రామాల సమీపంలోని అనుకూల ప్రదేశాలకు పిల్లలను తీసుకెళ్లి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందుకు ఎంపీడీఓ,వైద్యాధికారి సహకారం తీసుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సూపర్వైజర్లు మరియు సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆశించిన స్థాయిలో పురోగతి లేని పక్షంలో సంబంధిత సిబ్బంది జీతాల నిలుపుదలకు కూడా వెనుకాడబోమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆపరేటర్లు మరియు సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేసి, ఏప్రిల్ 30లోగా లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. మే 1 నాటికి పెండింగ్ ఉంటే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సూపర్వైజర్లు, సీడీపీఓలు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, గ్రామాల్లో పర్యటించి పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తి చేయని పక్షంలో సంబంధిత సూపర్వైజర్లు మరియు అధికారులపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో శతశాతం పిల్లలు హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని, వచ్చే నెల నాటికి 99 శాతం హాజరు రావాలని కలెక్టర్ ఆదేశించారు. వేసవి దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో చిన్న పిల్లలు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నీటిని తాగించి, తలకు ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సాధ్యమైనంత వరకు చిన్న గొడుగులు వినియోగించుకునేలా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా తల్లితండ్రులకు, గర్భిణీ స్త్రీలలో మూఢ నమ్మకాలు లేకుండా వారికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలకు సమయానుకూలంగా ఆరోగ్య పరీక్షలు చేసి, వివరాలు ఆరోగ్య కార్డుల్లో నమోదు చేయాలని అన్నారు. టిఫా స్కాన్ టెస్ట్ జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉందని, తద్వారా గర్భం లోపల బిడ్డ బాగోగులు తెలుసుకునేందుకు అవకాశం ఉన్నందున, ప్రతీ గర్భిణీకి ఈ పరీక్ష తప్పనిసరిగా చేయించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గర్భిణీలలో రక్తహీనత లేకుండా చూడాలని, వారితో ఎక్సర్ సైజులు చేయించి, సుఖప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎట్టి పరిస్థితిల్లో టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులు నమోదు కారాదని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ డా.టి.కనకదుర్గ, ఆధార్ సమన్వయకర్త శ్రీపతి రాజ్ కుమార్, సీడీపీఓలు, ఐసీపీఎస్ అధికారులు, వివిధ మండలాల సూపర్వైజర్లు మరియు సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


# నాణ్యత లోపమైన కానరాని అధికారుల పర్యవేక్షణ



**మక్కువ, (రాజధాని వార్తలు):** మండలంలోని కొయ్యానపేట పంచాయతీ పరిధి కంచేడువలసలో నూతనంగా నిర్మించిన రహదారి నిర్మాణంలో కూటమి నాయకుల కక్కుర్తితో నాణ్యత లోపం పూర్తిగా కనిపిస్తుంది. 20 లక్షల ఉపాధి హామీ నిధులతో సుమారు 300 మీటర్ల మేర కోనేరు గట్టు నుండి స్మశాన వాటికకు నూతనంగా వేసిన సీసీ రహదారిపై తీవ్రంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణి రహదారి నిర్మాణంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. రహదారి నిర్మాణం సరిగా లేకపోవడంతో పాటు, కల్వర్టులు నిర్మించలేదని, కోనేరు చుట్టూ రక్షణ గోడ నిర్మించాల్సి ఉన్నప్పటికీ పనులు చేయకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతనముగా వేసిన రహదారి సీసీ రోడ్ల కాకుండా, మట్టి రోడ్డులా ఉందని, నాణ్యతను పరిశీలించకుండా అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు ఎలా చెల్లించారని గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కోనేరు చెరువు నుంచి సీతానగ గరం మండలం బగ్గం దొర వలస వెళ్లే రహదారిలో సీసీ రహదారి నిర్మాణానికి గ్రావెల్ వేసి రహదారిని చదును చేశారు. రహదారిని చదును చేసేటప్పుడు రోడ్డుకు ఆనుకొని ఉన్న రైతులతో కనీసం చర్చించకుండా కాంట్రాక్టర్లు నచ్చినట్టు తవ్వేసారని రైతులు వాపోతున్నారు. గతంలో ఉన్న పైపు కల్వర్ట్‌ను పూర్తిగా త్రవ్వేసి, కల్వర్ట్‌ను నిర్మించకుండా రహదారి నిర్మించారని కోనేరు చెరువు పరిధి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతన రహదారి నిర్మాణంలో కలవర్ట్ ను పూర్తిగా మూసివేయడంతో, కోనేరు చెరువు నుండి రహదారి దిగువ భూములకు సాగునీరు ఎలా అందుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు రహదారి నిర్మాణ కాంట్రాక్టు తీసుకొని, తమను ఎవరు ప్రశ్నిస్తారనే అహంభావంతో నూతనంగా వేసిన సిసి రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించలేదని, పంచాయతీరాజ్ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించి, కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేశారని గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రౌతు రామారావుతో పాటు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి నూతన సిసి రహదారి నిర్మాణంలో నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొవాలని, కోనేరు గట్టునుండి స్మశాన వాటిక నిర్మించిన నూతన రహదారి పనులు సక్రమమయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 10 వినతులు

**- చట్టబద్ధంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి**



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను సానుభూతితో పరిశీలించి, చట్టబద్ధంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల నుంచి వివిధ సమస్యలపై 10 వినతులను కలెక్టర్ స్వీకరించారు.

ప్రధాన వినతుల వివరాలు ఇలా ఉన్నాయి:

పశుసంవర్ధక శాఖ: లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎన్.జగదీష్ తన అనారోగ్యంతో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవడానికి ప్రస్తుతం పనిచేస్తున్న ఆంపిలి నుండి తన ఒరిజినల్ ప్లేస్ ఉప్పినివలసకు రిలీవ్ చేయాలని కోరారు. అలాగే, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన ఎన్.నరసింహులు, తనను వెంటనే ప్రస్తుత విధులనుండి రిలీవ్ చేసి కొత్త స్థానంలో చేరేలా ఉత్తర్వులు ఇవ్వాలని విన్నవించారు.

విద్య శాఖ: సాలూరు మండలం ముద్దిపాలెం గ్రామానికి చెందిన జి.భవాని, తాను గతంలో అసిస్టెంట్ కుక్‌గా పనిచేసి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నానని, మానవతా దృక్పథంతో తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

పోలీస్ శాఖ: గతంలో కానిస్టేబుల్‌గా పనిచేసి 2014లో వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, తనకు రావాల్సిన జి.పి.ఎఫ్, ఏ.పి.జి.ఎల్.ఐ మరియు ఇతర బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ శాఖ: కొమరాడ మండలం బంగార్లమ్మపేటకు చెందిన విశ్రాంత వి.ఆర్.ఓ ఎం.హరినాథరావు, తనకు రావాల్సిన గ్రాట్యుటీ మరియు ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం తన ఒరిజినల్ సర్వీస్ రిజిస్టర్ ఇప్పించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులు: పాచిపెంట మండలం మూటకుండ గ్రామానికి చెందిన సచివాలయ సిబ్బంది ఎస్.అకిల కుమార్ మరియు ఇతరులు, తాము గత ఐదేళ్లుగా ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్నామని, తమకు రావాల్సిన 'ఏజెన్సీ అలవెన్స్' మంజూరు చేయాలని విన్నవించారు. ఈ వినతులపై స్పందించిన జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖాధికారులకు ఆయా ఫైళ్లను వెంటనే పంపాలని, నిర్ణీత కాలపరిమితిలోగా సమస్యలను పరిష్కరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్శిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్శిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ అయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# మండల పార్టీ అధ్యక్షుడిగా "పల్లి"

**- తనకు మండల పార్టీ అధ్యక్ష పదవి దక్కడంలో కీలక భూమిక పోషించిన మాజీ ఎమ్మెల్యే "బొత్స"కి నా కృతజ్ఞతలు - మండలంలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేస్తా : మండల పార్టీ అధ్యక్షుడు పల్లి సంజీవరావు**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం మండల పార్టీ అధ్యక్షుడిగా పల్లి సంజీవరావు నియమితులయ్యారు. పల్లి సంజీవ రావును మండల పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. మండల పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన పల్లి సంజీవరావుని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్, సీనియర్ వైకాపా నాయకులు బొత్స అప్పలనరసయ్య అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియ జేశారు. గతంలో పల్లి సంజీవరావు ఏఎంసీ చైర్మన్గా బాధ్యతలు నిర్వహించి ఉన్నారు. తనను నమ్మి మండల పార్టీ అధ్యక్షుడిగా చేసిన పార్టీ అధిష్టానం నమ్మకాన్ని వమ్ము చేయనని, పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానని పల్లి విలేకరులకు తెలియజేశారు. తనకు ఈ పదవి దక్కడంలో కీలక భూమిక పోషించిన మాజీ ఎమ్మెల్యే "బొత్స అప్పల నరసయ్యకు", "పల్లి" కృతజ్ఞతలు తెలియజేశారు.

# కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** వెదుళ్ళ చెరువు ఎస్టీ కాలనీకి చెందిన బండి రాణెమ్మ (భర్త: బండి వెంకటసుబ్బయ్య) ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించింది. ఆమె తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు చేసుకున్న సభ్యురాలు కావడంతో, పార్టీ తరఫున అమలులో ఉన్న ప్రమాద బీమా ద్వారా రూ. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయబడింది. ఈ సహా యాన్ని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. రిషితా రెడ్డి ప్రత్యేక కృషితో ఈ ఆర్థిక సహాయం తక్షణమే అందేలా చర్యలు తీసుకోవడం జరి గింది.

ఈ కార్యక్రమంలో ఉదయ్ కుమార్ రెడ్డి, మేకల రమేష్, వెంకటాద్రి యాదవ్, మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ఇలాంటి అత్యవసర సమయంలో పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు.

# ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చూస్తూ ఊరుకోను : ఎమ్మెల్యే సునీల్ కుమార్

**గూడూరు, (రాజధాని వార్తలు):** రోడ్డు ప్రమాదాల నివారణ పేరుతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా చిల్లకూరు జాతీయ రహదారి పోటు పాలెం కూడలి వద్ద సిమెంట్ దిమ్మెలను అడ్డుగా పెట్టారు. దీంతో గూడూరు నుండి కోట వాకాడు, చెన్నై వైపు వెళ్లే వాహనాలు ఆదిశంకర కళా శాల మలుపు వద్ద తిరిగి వెళ్లాలి, నెల్లూరు నుండి గూడూరు రావా లంటే పరగలి క్రాస్ రోడ్ నుండి మలుపు తిప్పుకొని వచ్చే విధంగా జాతీయ రహదారిపై పోలీసులు విధులు నిర్వహిం చకుండా తప్పిం చుకునే ప్రయత్నంలో భాగంగా ఏర్పాటు చేశారు. ఈ దిమ్మెల ఏర్పాటు వల్ల ద్విచక్ర వాహనదారులు, భారీ వాహనాలు, ప్రజలకు ఇబ్బందులు ఉన్న విషయాన్ని మీడియా ద్వారా గుర్తించిన గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ స్పందించి నేరుగా జాతీయ రహదారి వద్దకు వెళ్లి పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి దగ్గరుండి దిమ్మెలను తొలగించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఏ అధికారులు వ్యవహరించినా ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ప్రజలు కూడా రోడ్డు ప్రమాదాలను గుర్తించి, తమ ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని ప్రయాణాల సాగించాలన్నారు. త్వరలో 26 కోట్లతో ఫ్లై ఓవర్



బ్రిడ్జి కూడా ఏర్పాటు కానుందని అది పూర్తి అయిన వెంటనే ప్రయాణాలకు సులువుగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే తో పాటు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిల్లు చెంచురామయ్య, తిరు పతి జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఇజ్రాయిల్ కుమార్, డివిఎంసి సభ్యులు పెంచలయ్య, సురేంద్ర, గూడూరు నంబర్ 24పి ఎస్ సి ఎస్ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, జనసేన నాయకులు కొణిదెల ముని గిరీష్, గూడూరు పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు ఆరికట్ల మస్తాన్ నాయుడు, నాయకులు చంద్రమౌళి నాయుడు, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, పోలీసులు నాయకులు ఉన్నారు.

# భూములరీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి






**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన భూ రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట మండల నూతన తహసిల్దార్ యువరాజు సూచిం చారు. నాయుడుపేట మండలం గొట్టిప్రోలు గ్రామంలో శుక్ర వారం పంచాయతీ కార్యాలయం వద్ద రీ సర్వేపై రెవెన్యూ అధికా రులు గ్రామసభ నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయుడు పేట మండలం నూతన తహసిల్దార్ యువరాజు మాట్లాడుతూ గొట్టిప్రోలు గ్రామ పంచాయితీలో శనివారం నుండి రీ సర్వే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రైతులు రీ సర్వే అధికారు లకు అందుబాటులో ఉండాలని సూచించారు.రీ సర్వే జరుగు తున్న సమయంలో రైతు రైతులు వారి వారి పొలాల వద్ద ఉండి హద్దులు చూపించాలని తెలియజేశారు. రీ సర్వే పూర్తయిన అనం తరం ప్రభుత్వం ఉ చితంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు రీ సర్వే అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో గొట్టిప్రోలు ఎంపీటీసీ సభ్యులు పల్లమాల రామిరెడ్డి, గొట్టి ప్రోలు మాజీ సర్పంచ్ కె తిరుపాలు, గ్రామ రైతులు రఘురామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గుండాల చిన్నయ్య, వెంకయ్య, పిట్ల శ్రీరాములు, బందిలి కస్తూరయ్య, వీఆర్వో వెంకయ్య మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

## విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలో ఘనంగా 'వి-లాంచ్ ప్యాడ్-2026'





**అమరావతి, (రాజధాని వార్తలు):** నూతన ఆవిష్కరణలు మరియు స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించే ఉద్దేశంతో విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలో 'వి-లాంచ్ ప్యాడ్-2026'ను అత్యంత వైభవంగా నిర్వహించింది. విఐటి-ఏపి స్కూల్ ఆఫ్ బిజినెస్ మరియు ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకులు మరియు పారిశ్రామిక దిగ్గజాలకు ఒక వేదికగా నిలిచింది. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సృజనాత్మక వినూత్న ఆవిష్కరణలకు సంబంధించిన స్టాళ్లను అతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా విచ్చేసిన చంద్రశేఖర్ కుప్పేరి, రాజీవ్ శర్మ, సందల్ కోటవాలా మరియు కృష్ణన్ జి (CEO, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విజయవాడ) విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వీరు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం దిశగా సాగే పారిశ్రామిక ఆలోచనల ప్రాముఖ్యతను వారు వివరించారు. పరిశోధనలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, వాణిజ్యపరమైన ఉత్పత్తులుగా మారాలని ఆకాంక్షించారు. స్టార్టప్‌ల ఎదుగుదలలో ఇన్నోవేషన్ హబ్‌లు మరియు ఇంక్యుబేషన్ సెంటర్ల పాత్రను వారు కొనియాడారు. వైస్ ఛాన్సలర్ డా॥ పి. అరుల్మొళివర్మన్ మాట్లాడుతూ.. "ఒక విద్యార్థి - ఒక ఆవిష్కరణ" అనే లక్ష్యంతో విశ్వవిద్యాలయం ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ పోటీకి దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఐఐఎంలు మరియు ఎన్ఐటీలు వంటి 42 ప్రతిష్టాత్మక విద్యా



సంస్థల నుండి 620 రిజిస్ట్రేషన్లు అందాయని, తుది దశకు చేరిన 51 బృందాలు తమ వినూత్న ప్రోటోటైప్‌లను ప్రదర్శించాయని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డా॥జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ దేశంలో బలమైన స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంలో ఉన్నత విద్యా సంస్థల బాధ్యత ఎంతో ఉందని, యువ ఆవిష్కర్తలకు వి-లాంచ్ ప్యాడ్ ఒక అద్భుతమైన వేదిక అని అన్నారు. ఈ కార్యక్రమంలో డా॥ సుధా ఎల్లిసన్ మాతే (డైరెక్టర్, IIEC), డా॥ అరుణ్‌కుమార్ శివకుమార్ (స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ (i/c), డా॥రాఘవేంద్ర (కన్వీనర్), డా॥ ఉషా శేషాద్రి (కో-కన్వీనర్) తదితరులు పాల్గొన్నారు. యువతలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వక్తలు అభిప్రాయపడ్డారు.

## నా పొలిట్ బ్యూరో పదవి సామాన్య కార్యకర్తకు పార్టీ ఇచ్చిన భరోసా

### - మంత్రి కొండపల్లి మండల పార్టీ పదవి ఇస్తే, చంద్రబాబు, పొలిట్‌బ్యూరో మెంబర్‌ను చేశారు - జిల్లా టీడీపీలో గ్రూపులు లేవు, సమన్వయంతో పనిచేస్తున్నాం : టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి

**గజపతినగరం (విజయనగరం), (రాజధాని వార్తలు):** నాకు దక్కిన ఈ పొలిట్‌బ్యూరో పదవి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సామాన్య కార్యకర్తకు పార్టీ ఇచ్చిన భరోసా అని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో మెంబర్, గజపతినగరం మండల టీడీపీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి అన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు చెబుతుంటారని, ఆయన మాట ఇస్తే ఆచరణలో సాధ్యం చేసి చూపిస్తారు అనేందుకు తనకు దక్కిన ఈ పదవే నిదర్శనం అని గంట్యాడ శ్రీదేవి విలేకరులకు తెలియజేశారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి ఆయన సూచనలు, సలహాలు, ఆశీస్సులు తీసుకున్నట్టు శ్రీదేవి తెలిపారు. తనకు తెలుగుదేశం పార్టీ అత్యున్నత విధాన నిర్ణయ కమిటీ అయిన పొలిట్‌బ్యూరోలో స్థానం దక్కడంపై గంట్యాడ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. 2004 లో తెలుగుదేశం పార్టీలో సాధారణ కార్యకర్తగా తన ప్రయాణం మొదలైందని, ఎంపీటీసీగా, ఎంపీపీగా పనిచేసిన తనకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండల పార్టీ పగ్గాలు అప్పగించారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ పొలిట్‌బ్యూరో మెంబర్‌ను చేశారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. తన మీద నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను నెరవేర్చేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని ఆమె చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు కార్యకర్తల ద్వారా ప్రజలకు చేరువ కావడంలో తన వంతు కృషి చేస్తానని గంట్యాడ తెలిపారు. టీడీపీ అంటేనే బడుగు బలహీన వర్గాల



పార్టీ, పేదల పార్టీ అని, మహిళా సాధికారిత విషయంలో చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని శ్రీదేవి తెలిపారు. తాను పార్టీ నాయకులు అందరికి అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, మహిళా బిల్లు ప్రవేశపెట్టడానికి ముందే తనకు ఈ చక్కటి అవకాశం దక్కడం సంతోషంగా ఉందని గంట్యాడ శ్రీదేవి తెలియజేశారు. జిల్లా టీడీపీలో గ్రూపులు లేవని, అందరం కలిసికట్టుగా పని చేస్తున్నామని శ్రీదేవి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గంట్యాడ శ్రీదేవి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి - పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కు, ఎం.ఎస్ ఎం.ఇ, సర్ప్, ఎన్నారై శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో గజపతి నగరం ఏ.ఎం.సీ ఛైర్మన్ గోపాలరాజు, జిల్లా టీడీపీ జనరల్ సెక్రటరీ ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, విజయనగరం టౌన్ జనరల్ సెక్రటరీ పీతల కోదండరామ్, గంట్యాడ మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యువతకు రాజకీయాల్లో స్థిరమైన ఎదుగుదల సాధ్యమే

### - నిరూపించిన టీడీపీ రాజ్యసభ సభ్యులు, జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్ బాబు

### - ఆయన ఎదుగుదల.. యువతకు అదర్శం - కార్యకర్త నుంచి జాతీయ ఉపాధ్యక్షుడి వరకు సానా సతీష్ బాబు రాజకీయ ప్రస్థానం





















భారతీయ రాజకీయాల్లో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి జాతీయ స్థాయి నాయకత్వానికి ఎదగడం చాలా అరుదైన విషయం. అయితే, అలాంటి అవకాశాలను సృష్టించే రాజకీయ వేదికగా తెలుగుదేశం పార్టీ నిలిచిందనే విషయాన్ని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు రాజకీయ ప్రస్థానం స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, క్రమంగా పార్టీకి కీలక వ్యూహకర్తగా, చివరకు జాతీయ ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగిన విధానం, పార్టీ అంతర్గత వ్యవస్థలో ఉన్న సామర్థ్యాన్ని, క్రమశిక్షణను తెలియజేస్తోంది.

ప్రారంభం నుంచి ప్రగతి దిశగా :

2011లో పార్టీ క్రియాశీల కార్యకర్తగా రాజకీయ రంగంలో అడుగుపెట్టిన సతీష్ బాబు, మొదటి నుంచే చురుకుదనం, కట్టుబాటు, అంకితభావంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. స్థానిక స్థాయిలో పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా నాయకత్వ దృష్టిని ఆకర్షించారు. పార్టీ సిద్ధాంతాల పట్ల విశ్వాసం, సంస్థాగత కట్టుబాటు, ప్రజలతో మమేకమయ్యే తీరు ఆయన ఎదుగుదలకు బలమైన పునాది అయ్యాయి. ఈ దశలోనే ఆయనలోని నిర్వహణా నైపుణ్యం, సమన్వయ సామర్థ్యం పార్టీ పెద్దల దృష్టికి వచ్చాయి. దాంతో క్రమంగా ఆయనకు పార్టీ లోపలి కీలక బాధ్యతలు అప్పగించబడుతూ వచ్చాయి. ఒక కార్యకర్త నుంచి బాధ్యతాయుత నాయకుడిగా మారే ప్రక్రియలో ఆయన చూపిన స్థిరత్వం, కృషి రాజకీయాల్లో ఎదగాలనుకునే యువతకు ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది.

ఎన్నికల వ్యూహకర్తగా ప్రతిభ :

2024 సాధారణ ఎన్నికలు సతీష్ బాబు రాజకీయ జీవితంలో కీలక మలుపు. ఉమ్మడి గోదావరి జిల్లాలకు ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా నియమితులైన ఆయన, ఆ బాధ్యతను కేవలం పరిపాలనా కోణంలో కాకుండా వ్యూహాత్మకంగా నిర్వహించారు. స్థానిక సామాజిక సమీకరణలు, అభ్యర్థుల ఎంపిక, ప్రచార ప్రణాళికలు, మైక్రో మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో సమర్థవంతమైన సమన్వయం చూపించారు. ఆయన సమన్వయంతో ఆ ప్రాంతంలో 21 మంది ఎమ్మెల్యేలు, 3 మంది ఎంపీలు విజయం సాధించడం విశేషం. ఈ ఫలితాలు కేవలం ఎన్నికల విజయాలుగా కాకుండా, ఆయన వ్యూహాత్మక సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచాయి. ఎన్నికల రాజకీయాల్లో గ్రౌండ్ లెవల్ డైనమిక్స్‌ను అర్థం చేసుకుని వాటిని ఫలితాలుగా మార్చగల నాయకుడిగా ఆయన ప్రతిష్ఠ పెరిగింది.

ఉద్యమాల్లో చురుకుదనం - యువగళం ప్రభావం :

పార్టీ కార్యకలాపాల్లో మాత్రమే కాకుండా ఉద్యమాల్లో కూడా సతీష్ బాబు చురుకైన పాత్ర పోషించారు. నారా లోకేష్ చేపట్టిన "యువగళం" పాదయాత్రలో ఆయన పాల్గొనడం, యువతను పార్టీ వైపు ఆకర్షించడంలో కీలకంగా మారింది. ఈ యాత్రలో ఆయన చేసిన గ్రౌండ్ కనెక్ట్ కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై స్పందన, యువతతో నేరుగా మమేకమయ్యే విధానం పార్టీకి కొత్త శక్తిని అందించాయి. అలాగే, నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అనంతరం జరిగిన ఉద్యమాల్లో కూడా సతీష్ బాబు ముందుండి పోరాటం చేశారు. పార్టీకి అనుకూల పరిస్థితులు లేకపోయినా, కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపడం, సమన్వయం చేయడం, ఉద్యమాలను ముందుకు నడిపించడం వంటి అంశాల్లో ఆయన నాయకత్వ లక్షణాలు స్పష్టంగా కనిపించాయి.

రాజ్యసభ నుంచి జాతీయ ఉపాధ్యక్షుడి వరకు :

పార్టీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం, 2024 డిసెంబర్‌లో ఆయనను రాజ్యసభ సభ్యుడిగా నియమించడం ద్వారా విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. ఇది కేవలం వ్యక్తిగత పురోగతి మాత్రమే కాదు, పార్టీకి ఆయన అందించిన సేవలకు ప్రతిఫలం కూడా. ఇక 2026 ఏప్రిల్‌లో పార్టీ సంస్థాగత మార్పుల నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ, సీఎం చంద్రబాబు పార్టీని జాతీయ స్థాయిలో విస్తరించాలనే లక్ష్యంతో కొత్త బృందాన్ని ఏర్పాటు చేశారు.

ఈ క్రమంలో నారా లోకేష్‌ను జాతీయ వర్కింగ్ ప్రెసిడెం ట్‌గా నియమించగా, సానా సతీష్ బాబును జాతీయ ఉపాధ్యక్షు డిగా నియమించడం పార్టీ భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారింది. ఈ నియామకం ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణంలో యువ నాయకత్వానికి ప్రాధాన్యం పెరిగిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సతీష్ బాబు వంటి నాయకులు జాతీయ స్థాయిలో పార్టీ విస్తరణకు కొత్త దిశను అందిస్తారని భావిస్తున్నారు.

సమన్వయం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు :

జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, సతీష్ బాబు తన దృష్టిని కేంద్ర-రాష్ట్ర సమన్వయంపై కేంద్రీకరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టడం, పెట్టుబడులను ఆకర్షించడం, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు అందించడం వంటి అంశాల్లో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యేకంగా ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన చూపుతున్న చొరవ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రంతో సమన్వయం పెంచడం ద్వారా రాష్ట్రానికి మరిన్ని అవకాశాలను తీసుకురావాలనే దిశగా ఆయన కృషి కొనసాగుతోంది.

నాయకత్వంపై విశ్వాసం - భవిష్యత్ దిశ

ఈ సందర్భంగా సతీష్ బాబు, తనపై నమ్మకం ఉంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలతో కలిసి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే, నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ముగింపు: కార్యకర్తకు అవకాశమిస్తే నాయకత్వం ఎలా రూపుదిద్దుకుంటుందో...

సానా సతీష్ బాబు రాజకీయ ప్రస్థానం ఒక వ్యక్తిగత విజయగాథ మాత్రమే కాదు; అది ఒక సంస్థాగత మోడల్‌కు ప్రతిరూపం. క్రమశిక్షణ, కృషి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ఉంటే, ఒక కార్యకర్త కూడా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదగవచ్చని ఆయన ప్రయాణం చెబుతోంది. ఈ ప్రస్థానం, ముఖ్యంగా యువతకు రాజకీయాల్లో స్థిరమైన ఎదుగుదల సాధ్యమనే సందేశాన్ని ఇస్తోంది. పార్టీకి కట్టుబాటు, ప్రజలతో అనుసంధానం, సమర్థవంతమైన నిర్వహణ ఉంటే, రాజకీయాల్లో ఉన్నత స్థానాలు అందుబాటులో ఉంటాయని సతీష్ బాబు ఉదాహరణగా నిలుస్తున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan